RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:211 | శనివారం | 05 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను


జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098



## జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం

- కక్ష్యలోకి 2,367 కిలోల ఈఓఎస్-05 ఉపగ్రహం
- రక్షణ, సరిహద్దు పర్యవేక్షణలో కీలక సేవలు
- వాతావరణ అంచనా, విపత్తు నిర్వహణకు ఉపయోగం
- జీఎస్ఎల్వీ సిరీస్‌లో 19వ ప్రయోగం

2





## నేపాల్‌టిబెట్ వరదల్లో 275 మంది భారతీయులు గల్లంతు

- 166 మందిని సురక్షితంగా రక్షించిన భారత్
- విపత్తులో 1,308 మంది మృతి.. 5,624 మంది గల్లంతు
- టిబెట్ నుంచి నేపాల్‌లోకి 1,907 మంది భారతీయులు
- 9 రోజుల తర్వాత ఇద్దరు కార్మికులు సజీవంగా

4



## సీఎం భద్రతా వివరాల లీక్‌పై కేసు

- తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై సైబర్ క్రైమ్ దర్యాప్తు
- జెడ్ ప్లస్ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారం బహిర్గతం
- ఖైరతాబాద్ నుంచి సైబర్ క్రైమ్‌కు బదిలీ
- అధికారిక వైర్‌లెస్ సందేశం లీక్‌పై విచారణ

3



# కేసీఆర్‌పై కాంగ్రెస్ మహా ధర్నా అస్త్రం

- అసెంబ్లీ సమావేశాలకు ముందే రాజీనామా డిమాండ్‌తో హస్తం పార్టీ వ్యూహం
- సెప్టెంబర్ 6న ఇందిరాపార్క్ వద్ద నిరసన
- రంగంలోకి మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు
- సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు
- సభకు కేసీఆర్ హాజరుపై కాంగ్రెస్ ఒత్తిడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

తెలంగాణ శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత ముదురుతోంది. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ వ్యూహాలు సిద్ధం చేసుకుంటుండగా.. ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ కొత్త అస్త్రాన్ని సిద్ధం చేసింది. కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించేందుకు నిర్ణయించింది.

**మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహాలు**

కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మహా ధర్నాకు సంబంధించి శనివారం ఉదయం 9 గంటలకు సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగే

మిగతా 2వ పేజీలో..

## డిగ్రీ, గురుకుల భవనాలు త్వరగా పూర్తిచేయాలి

- రెండు రోజుల పర్యటనకు కొడంగల్ విచ్చేసిన సీఎం
- నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష
- మక్తల్- నారాయణపేట్- కొడంగల్ ఫేజ్-2కు త్వరగా టెండర్లు పిలవాలి
- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన

2



## భూముల చుట్టూ తిరుగుతున్న రేవంత్ రెడ్డి

- రైతుల భూములను 22ఏ లో పెట్టడం దారుణం
- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై కౌటాలలో భారీ నిరసన
- హరీష్ రావు తీవ్ర ఆగ్రహం

**సిర్పూర్ కాగజ్‌నగర్/ కౌటాల:**

సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల

మిగతా 2వ పేజీలో..





## కాంగ్రెస్‌ను 'పచ్చ కాంగ్రెస్' అనడం హాస్యాస్పదం

3

నానాజాతి సమితిలాంటి బీఆర్ఎస్సా విమర్శించేది?

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



## వారికి దేశ భక్తి సర్టిఫికెట్లు ఇవ్వడం తగదు

- అది దేశాన్ని అవమానించడమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

2

## శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలి

- తెలంగాణకు కేఆర్ఎంబీ కీలక ఆదేశాలు
- తాగునీటికే తొలి ప్రాధాన్యత
- నీటి కొరతలో సాగు, విద్యుత్ కంటే తాగునీరు ముఖ్యం
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

3





## ఏపీ పునర్విభజన సరిగా జరగలేదు

3

## సమ్మక్క సాగర్‌కు త్వరగా ఎన్ఓసీ ఇవ్వాలి



3



3

## కేసీఆర్ చాలా మంచోడు

- హుందాగా రిసీవ్ చేసుకునేవారు
- కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు

2

- సురేఖ తొలగింపుపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

## హద్దులు దాటితే
# ఎవరిపైనైనా చర్యలు

- సురేఖ తొలగింపుపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చి చెప్పారు. దిల్లీలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమార్తె సుష్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తు చేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు అని ఆయన అన్నారు. అయితే సురేఖ కాంగ్రెస్‌లోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని హామీ ఇచ్చారు.



## జీఎస్ఎల్వీ-ఎఫ్17
# ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట, సెప్టెంబర్ 4:**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో విజయాన్ని నమోదు చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్ఎల్వీఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 2,367 కిలోల బరువున్న ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (ఈఓఎస్05)ను శాస్త్రవేత్తలు విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం కావడం విశేషం.

**సరిహద్దులపై నిఘా**

కక్ష్యలోకి చేరిన ఈఓఎస్05 ఉపగ్రహం దేశ రక్షణ వ్యవస్థకు కీలకంగా మారనుంది. ముఖ్యంగా సరిహద్దుల పర్యవేక్షణలో అధునాతన నిఘా సామర్థ్యాలతో పనిచేయనుంది. సరిహద్దు ప్రాంతాల్లో చోటుచేసుకునే మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించడంతో పాటు భద్రతా దళాలకు అవసరమైన సమాచారాన్ని అందించనుంది. దీంతో దేశ భద్రతా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

**విపత్తులపై ముందస్తు సమాచారం**

రక్షణ రంగంతో పాటు వాతావరణ అంచనా, విపత్తు నిర్వహణలోనూ ఈఓఎస్ 05 కీలక సేవలు అందించనుంది. వాతావరణ మార్పులను కచ్చితంగా పరిశీలించే సామర్థ్యంతో పాటు ప్రకృతి విపత్తులకు సంబంధించిన సంకేతాలను ముందుగానే గుర్తించేందుకు ఉపగ్రహంలోని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడనుంది. తుఫాన్లు, వరదలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేసేందుకు ఇది దోహదపడనుంది.

**ప్రాణ, ఆస్తి నష్టాల నివారణ**

విపత్తులపై ముందస్తు సమాచారం అందడం ద్వారా సహాయక చర్యలను వేగంగా చేపట్టే అవకాశం ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడం, సహాయక బృందాలను సిద్ధం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించేందుకు ఈఓఎస్05 సేవలు ఉపయోగపడనున్నాయి.

## వారికి దేశ భక్తి సర్టిఫికెట్లు
# ఇవ్వడం తగదు

- అది దేశాన్ని అవమానించడమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాల కోసం ఒవైసీ బ్రదర్స్ దేశభక్తులంటూ ప్రశంసలు కురిపించడం తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోందని, ఇది సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ధ్వజమెత్తారు. దేశభక్తులు అంటే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా అని, అలాంటి మహోన్నత నాయకులతో ఒవైసీలను పోల్చడం ఒక విడ్డూరమని ఎద్దేవా చేశారు. అసలు ఏ అర్హతను చూసి ఒవైసీ సోదరులకు రేవంత్ రెడ్డి దేశభక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. గతంలో 15 నిమిషాలు పోలీసులను పక్కకు జరిపితే ఈ దేశంలో ఎవరి పరిస్థితి ఎలా ఉంటుందో చూపిస్తామంటూ బెదిరింపులకు దిగినందుకా.. లేక బహిరంగంగా మేము ఆవు మాంసం తింటాం అంటూ మాట్లాడినందుకు మెచ్చుకుని దేశ భక్తి సర్టిఫికెట్లు ఇస్తున్నారా.. అసలు దేని కోసం వీళ్లను దేశ భక్తులు అంటున్నారో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని నిలదీశారు. దేశభక్తి అంటే దేశాన్ని ఒకటిగా కలిపే జాతీయ జెండాకు, జాతీయ గీతానికి, జాతీయ గేయానికి మర్యాద ఇవ్వడమని గుర్తు చేశారు. అసెంబ్లీలో వందేమాతరం పాడుతుంటే ఒక్క మజ్లిస్ ఎమ్మెల్యే గానీ, ఓవైసీ సహా ఎవరూ నిలబడలేదని, మరి అలాంటి వాళ్లను చూసి దేశ భక్తులు, పేట్రియాటిజం అనడం హాస్యాస్పదమని అన్నారు. రాహుల్ గాంధీకి పాకిస్తాన్, చైనాలపై ఎలాంటి దేశ భక్తి ఉందో అదే దేశ భక్తి ఈ ఒవైసీలకు కూడా ఉందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారేమోనని విమర్శించారు. మోదీకి, అమిత్ షాకు దేశ భక్తి ఉందని రేవంత్ రెడ్డి ఒప్పుకున్నందుకు సంతోషమని, కానీ ఒవైసీలకు దేశభక్తి సర్టిఫికెట్లు ఇవ్వడం మాత్రం ఈ దేశంలో ప్రతి ఒక్కరినీ ఘోరంగా అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్‌కు నిజంగా దేశ భక్తి ఉంటే ముందుగా సభల్లో పూర్తిగా వందేమాతరం పాడి నిరూపించుకోవాలని, ఆ రోజే వాళ్లు కూడా దేశ భక్తులు అవుతారని స్పష్టం చేశారు. ఈ బుజ్జగింపు వ్యాఖ్యలను ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారని రామచందర్‌రావు అన్నారు.

# డిగ్రీ, గురుకుల భవనాలు త్వరగా పూర్తిచేయాలి

- రెండు రోజుల పర్యటనకు కొడంగల్ విచ్చేసిన సీఎం
- నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష
- మక్తల్- నారాయణపేట్- కొడంగల్ ఫేజ్-2కు త్వరగా టెండర్లు పిలవాలి
- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన



**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన ఆయన మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చిలోగా వేగవంతంగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పను□ నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు ఉండాలని, కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మద్దూరులో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం సొంత డబ్బులతో భూమిని కొనుగోలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపట్టారు. ఆనాడు ముందుకు వచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులనూ పరిశీలించారు.

**క్యాలెండర్‌లుఎంచుకోండి**

**గోకఫసల్వాద్ చేరుకున్న ముఖ్యమంత్రి**

దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాద్‌లో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం పరిశీలించారు. అనంతరం దౌల్తాబాద్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్, ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీలు, 430 బెడెడ్ హాస్పిటల్, ఇతర నిర్మాణాలు పరిశీలించారు. ఎడ్యుకేషన్ హబ్‌లో జరిగే అన్ని నిర్మాణాల విషయంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాల్లో నాణ్యత, ఇతర సాంకేతిక అంశాల విషయాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.

**ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష**

గత సమీక్ష సమావేశంలో సీఎం సూచనలను పనుల్లో మక్తల్ నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పంప్ హౌస్ పనులు ముందుకు తీసుకెళుతున్నామని ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో అధికారులు సీఎంకు తెలిపారు. ఫేజ్ 2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు ప్రతీ సంవత్సరానికి అవసరమైన బడ్జెట్‌కు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను పూర్తి చేయాలన్నారు. ఫేజ్ 1 పనులను డిసెంబర్ 2027 నాటికి, ఫేజ్ 2 పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు.

# కేసీఆర్‌పై కాంగ్రెస్ 'మహా ధర్నా' అస్త్రం

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశానికి రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఇతర ముఖ్య నేతలు హాజరుకానున్నారు. ధర్నాను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు.

**సభకు రావాలని సీఎం సవాల్**

అసెంబ్లీ సమావేశాలకు ముందే కేసీఆర్ రాజీనామా డిమాండ్‌తో కాంగ్రెస్ చేపడుతున్న మహాధర్నా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై అసెంబ్లీ వేదికగా చర్చించేందుకు కేసీఆర్ సభకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు సవాల్ చేశారు. అయితే కేసీఆర్ మాత్రం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్నారని కాంగ్రెస్ విమర్శిస్తోంది.

**మూడుసార్లు మాత్రమే హాజరు**

2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు కేవలం మూడుసార్లు మాత్రమే హాజరయ్యారని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. తొలిసారి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు సభకు వచ్చిన కేసీఆర్.. ఆ తర్వాత 202526 వార్షిక బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రసంగం రోజున హాజరయ్యారు. అనంతరం 2025 డిసెంబర్ శీతాకాల సమావేశాల తొలిరోజు కొద్దిసేపు సభకు వచ్చారు. ఆ తర్వాత సమావేశాలకు ఆయన హాజరు కాలేదు.

**ఒత్తిడి పెంచేలా మహాధర్నా**

ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ తన బాధ్యతలను నిర్వర్తించడం లేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు, తన అనుభవాన్ని సభలో పంచుకునేందుకు కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శిస్తోంది. ఇప్పటి వరకు రాజకీయ విమర్శలకే పరిమితమైన కాంగ్రెస్.. తాజాగా మహాధర్నాకు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ నిరసనతోనైనా కేసీఆర్ అసెంబ్లీకి హాజరవుతారా? లేక కాంగ్రెస్ డిమాండ్‌ను పట్టించుకోకుండా ముందుకు సాగుతారా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.



# 10 వేల ఇళ్లు 22-ఏలో పెట్టడం దారుణం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు

**మంచిర్యాల, సెప్టెంబర్ 4:**

ఒక్క మంచిర్యాల జిల్లాలోనే 22ఏ నిషేధిత జాబితా ముసుగులో 5,525 ఎకరాల ఇండ్ల స్థలాలు, పట్టణ పరిధిలో 10 వేల ఇండ్లను ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టి ప్రజల ఆస్తులను సున్నా చేసిందని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దశాబ్దాలుగా నివాసముంటున్న ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే కబ్జాదారుడిగా మారి ప్రజల గొంతు కోస్తోందని విమర్శించారు. పట్టణంలోని రెడ్డి కాలనీ, రాజీవ్ నగర్, ఎన్టీఆర్ నగర్, తిలక్ నగర్, గౌతమ్ నగర్, ఇస్లాంపూర్, ఏసీసీ, శ్రీరామ్ నగర్ ప్రాంతాలతోపాటు 1982 గోదావరి వరదల సమయంలో నస్పూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్లడ్ కాలనీలోని ఇండ్లను కూడా 22ఏ లో పెట్టారని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం జీవో 76 ద్వారా సింగరేణి కార్మికులకు ఉచితంగా ఇచ్చిన 6,222 రిజిస్టర్డ్ ఇండ్ల పట్టాలను, పేదలకు ఇచ్చిన జీవో 58, 59 పట్టాలను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసి ప్రజలను రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఇళ్లు, ప్లాట్లు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో నిర్మాణ అనుమతులు (బిల్డింగ్ పర్మిషన్లు) రావడం లేదని, బ్యాంకులు రుణాలు నిలిపివేశాయని, ఆడపిల్లల పెళ్లిళ్లు కాక ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**ముఖ్యమంత్రికి ఒక న్యాయం..**

**పేదలకు ఒక న్యాయమా?**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు 22ఏ లో పడితే ఎటువంటి దరఖాస్తు లేకుండా రాత్రికి రాత్రే ఆ జాబితా నుండి తొలగించుకున్నారని, మరి సాధారణ ప్రజలు దరఖాస్తులు పట్టుకుని మీసేవలు, ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ ఎందుకు తిరగాలని ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 'సారీ' చెప్తే సరిపోదని, 22ఏ భూములపై తక్షణమే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**పోరాట కార్యాచరణ**

ప్రభుత్వం ఎటువంటి దరఖాస్తులతో సంబంధం లేకుండా రాత్రికి రాత్రే 22ఏ లో పెట్టిన ఆస్తులన్నింటినీ బేషరతుగా తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 10 వేల బాధిత కుటుంబాలతో మంచిర్యాల కలెక్టరేట్‌ను ముట్టడించి 'వంటా వార్పు' చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పక్షాన ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీసి మెడలు వంచుతామని తేల్చి చెప్పారు



# భూముల చుట్టూ తిరుగుతున్న రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

వైఫల్యాలపై సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం కౌటాలలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అకారణంగా తమ భూములను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టడంతో పడుతున్న ఇబ్బందులను స్థానిక రైతులు హరీష్‌రావుకు తెలిపి కన్నీటిపర్యంతమయ్యారు. రాత్రికి రాత్రే సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 42,867 ఎకరాలను నిషేధిత జాబితాలో పడేశారని తెలిపారు. ఇందులో చింతల మానేపల్లిలో 8,878 ఎకరాలు, బెజ్జూర్లో 8,325 ఎకరాలు, కాగజ్‌నగర్లో 6,690 ఎకరాలు, కౌటాలలో 6,350 ఎకరాలు, దహేగాంలో 5,268 ఎకరాలు, సిర్పూర్ (టి)లో 4,406 ఎకరాలు, పెంచికల్ పేట్ లో 2,950 ఎకరాలు ఉన్నాయన్నారు. భూములు 22ఏ లో పడటంతో బ్యాంకులు అప్పులు ఇవ్వడం లేదని, రిజిస్ట్రేషన్లు కాక ఆడబిడ్డల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. రేపు రైతుబంధు, బీమా, ఎరువులు కూడా దక్కకుండా పోయే ప్రమాదం ఉందన్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి**

రాష్ట్రవ్యాప్తంగా 14.50 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి 40 వేల మంది రైతులను కబ్జాదారులుగా చిత్రీకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఇల్లు 22ఏ లో పడితే రాత్రికి రాత్రే తొలగించుకున్నారని, మరి పేద రైతులకు ఒక న్యాయం, ముఖ్యమంత్రికి ఇంకో న్యాయమా అని హరీష్ రావు ప్రశ్నించారు.

**పొంగులేటిని అసెంబ్లీ నుంచి నిషేధించాలి**

ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని అబద్ధాలు ఆడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అసెంబ్లీ సమావేశాలకు రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ పాలనలో పథకాలన్నీ బంద్**

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు అన్నీ బంద్ అయ్యాయని ఆరోపించారు. నెలకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని చెప్పి ప్రతి అవ్వకు, తాతకు ఈ ప్రభుత్వం రూ.66,000 బాకీ పడిందని, ఆ పాత బాకీలన్నీ వడ్డీతో వసూలు చేస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.

**పోరాటానికి పిలుపు**

ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీష్ రావు హెచ్చరించారు. అప్పటికీ భూములను 22ఏ నుంచి తొలగించకపోతే ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముందు 'వంటా వార్పు' చేపడతామని, అవసరమైతే లక్షలాదిమంది రైతులతో సెక్రటేరియట్, సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని స్పష్టం చేశారు. కోనేరు కోనప్ప, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇద్దరూ ఒక్కటయ్యారని, రైతుల భూములకు విముక్తి లభించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ఏపీ పునర్విభజన సరిగా జరగలేదు

- పూర్తిగా నష్టపోయిన భద్రాచలం పరిసర ప్రాంతాలు
- విభజన తర్వాత సీఎంగా కేసీఆర్ దృష్టి పెట్టకపోవడంతోనే నష్టం
- కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే భద్రాచలం వెనుకబాటు
- పోలవరం ప్రాజెక్టుతో భద్రాచలానికి ప్రమాదం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

**భద్రాచలం, సెప్టెంబర్ 4 :**

ఆంధ్రప్రదేశ్ పునర్విభ□జన సరిగా జరగలేదని, కావాలని భద్రాచల పరిసర ప్రాంతాలను ఆంధ్రాలో కలుపుకోవడం వల్ల భద్రాచలం ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లిందని రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీతారామ చంద్రస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత భద్రాచల ప్రాంతం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు (కేసీఆర్) ఈ ప్రాంతంపై దృష్టి పెట్టకపోవడం వల్ల, కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కవ్వడం వల్ల ఈ ప్రాంతంలోని మండలాలు, గ్రామాలు ఆంధ్ర ప్రాంతంలో కలిసిపోయాయన్నారు. తెలంగాణకు మొదటి ముఖ్యమంత్రి అయిన దొరవారు చేసిన తప్పులు చాలా ఉన్నాయన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వంతో చేతులు కలిపి భద్రాచలం మండలాలు, పంచాయతీలను ఆంధ్ర ప్రాంతానికి కట్టబెట్టారని విమర్శించారు. ఆంధ్ర ప్రాంతానికి వెళ్లిన పంచాయతీలను తెలంగాణలోకి తెచ్చుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలం ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రల్ వాటర్ కమిషన్ నివేదికలు కూడా గట్టిగా చెబుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా పోలవరం ప్రాజెక్టును ఎత్తు తగ్గించకుండా నిర్మించడం ఈ ప్రాంత ప్రజలను ఇబ్బందులపాలు చేయడమేనని అన్నారు. ఇప్పటికే గోదావరి 55 అడుగులు వస్తే భద్రాచలం ప్రాంతాలు పూర్తిగా నీట మునుగుతున్నాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం వద్ద పూర్తిస్థాయిలో బ్యాక్ వాటర్ చేరుకుంటుందని, ఈ కారణంగా భద్రాచలం ముంపునకు గురవుతుందని చెప్పారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏపీతో మాట్లాడి ముంపు ప్రాంతాలు తగ్గించే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ దిశగా పనిచేయడం లేదన్నారు. కేవలం పక్క రాష్ట్రానికి మాత్రమే నిధులు కేటాయిస్తూ పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ముందుకు సాగుతున్నారని అన్నారు. ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఐదు పంచాయతీలను ఆంధ్రలో కలుపుకున్నారని అన్నారు. భద్రాద్రికి ఏపీ రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుందని, అయినప్పటికీ భద్రాచల ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ భద్రాచలం అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించామని చెబుతూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. రామాలయం అభివృద్ధి పూర్తిస్థాయిలో చేసి భక్తులకు అందుబాటులో తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు.

# కాంగ్రెస్‌ను 'పచ్చ కాంగ్రెస్' అనడం హాస్యాస్పదం

**ములుగు, సెప్టెంబర్ 4 :**

అన్ని రాజకీయ పార్టీల నుంచి వచ్చిన నాయకులను చేర్చుకుని బీఆర్ఎస్ ఒక 'నానాజాతి సమితి'లా మారిందని, అలాంటి పార్టీ కాంగ్రెస్‌ను విమర్శించడం హాస్యాస్పదమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) మండిపడ్డారు. ములుగు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో కేటీఆర్, బీఆర్ఎస్ బీజేపీ నాయకుల వైఖరిపై ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.కేసీఆర్ రాజకీయ ప్రస్థానం టీడీపీతోనే ప్రారంభమైందని, కేటీఆర్‌కు తారకరామారావు అనే పేరు కూడా ఎన్టీఆర్ జ్ఞాపకార్థమే వచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో టీడీపీ నాయకులు చేరలేదా? మరి బీఆర్ఎస్‌ను కూడా 'పచ్చ పార్టీ' అనాలా అని ప్రశ్నించారు.

**ప్రజా ప్రభుత్వ పాలన – అభివృద్ధి సంక్షేమ పథకాలు**

గత ప్రభుత్వం పదేళ్లలో ఇళ్లు ఇవ్వలేకపోయినా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తొలి దశలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందరైతులకు సన్నవడ్లకు బోనస్ చెల్లించి ధాన్యం కొనుగోలు చేయడమే కాక అదే సన్నబియ్యాన్ని పేదల కడుపు నింపేందుకు పంపిణీ చేస్తున్నాం.. సామాన్య కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాం.. రైతు రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సమర్థవంతంగా చేపడుతున్నామని చెప్పారు.

**బీఆర్ఎస్ హామీల అమలుపై విమర్శ**

పదేళ్ల పాలనలో దళితుడిని సీఎం చేస్తామని, ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య ఇస్తామని చెప్పి ఏ ఒక్క హామీని నెరవేర్చలేకపోయారని విమర్శించారు.కాంగ్రెస్ నాయకులను, ప్రజాప్రతినిధులను కించపరిచేలా పోస్టర్లు వేస్తూ వ్యక్తిగతంగా అవమానిస్తే సహించేది లేదని, కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు.

**బహిరంగ చర్చకు సిద్ధం**

నియోజకవర్గం, మండలాల వారీగా లబ్ధిదారుల జాబితాల లెక్కలతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని మంత్రి సవాల్ విసిరారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలే తప్ప ప్రతీ పనిని రాజకీయ కోణంలో అడ్డుకోవడం సరికాదన్నారు. అలాగే తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో, ఇందిరమ్మ ఇళ్లకు రావాల్సిన నిధులపై ఎందుకు సహకరించడం లేదో ఆ పార్టీ నాయకులు జవాబు చెప్పాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

## కేసీఆర్ చాలా మంచోడు

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 :**

మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆరఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆరఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ 'కేసీఆర్ చాలా మంచి వ్యక్తి.. ఎప్పుడు కలిసినా తమను ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు' అని కొనియాడారు. బీఆరఎస్‌లో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన సురేఖ కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు బీఆరఎస్‌లో చేరే అవకాశం ఉందా అనే ప్రచారం జోరందుకుంది.

# పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**రఘునాథపాలెం/ఖమ్మం, సెప్టెంబర్ 4:**



రఘునాథపాలెం మండల ప్రజల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రఘునాథ పాలెం మండలం పుతానితాండ గ్రామం లో పుతాని తాండ జెడ్ పీ రోడ్డు నుండి రేపల్లెవాడ తండా వరకు రూ.330.92 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎల్నినో దృష్ట్యా తీవ్ర వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, అల్ప వర్షపాతం వుందని, రైతులు సాంప్రదాయ పంటల కంటే తక్కు వ కాలపరిమితి కలిగిన పంటలు సాగుచే యాలన్నారు. ఆయిల్ పామ్, మిర్చి, కూర గాయల సాగు తో లాభాలొస్తాయన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఎక రాకు రూ. 50,000 వరకు ప్రోత్సాహకం, అంతర పంటగా కూరగాయలు వేస్తే అద నంగా రూ. 2,000తో పాటు ఉచితంగా డ్రిప్ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా 40 ఏళ్ల వరకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని మం త్రి వివరించారు. మంచుకొండ ద్వారా నీటి విడుదల కు చర్యలు చేపట్టినట్లు మం త్రి తెలిపారు. బొగ్గువాగు ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ.100కోట్లతో పైప్లైన్ల ద్వారా చెరువులను నింపే కార్యక్రమాన్ని త్వరలో నే ప్రారంభించనున్నట్లు అన్నారు. చెరువు లు నిండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి, రైతుల బోర్లకు నిరంతర నీటి సరఫరా అందుతుందని మంత్రి తెలిపారు. పోడు భూములకు పట్టాలు పొందిన రైతులకు బోర్లు, విద్యుత్ కనెక్షన్లు, సోలార్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 10న సమస్య ఉన్నవారు దరఖాస్తు చేయాలన్నారు. ఆర్వోఎస్ఆర్ పట్టా కలిగిన భూమి యజమానులకు బోర్ వెల్ తవ్వుకోవడానికి అనుమతులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. కార్యాల యాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా బోర్ వెల్ పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న రోజే పరిశీలించి అనుమతులు ఇచ్చేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పా టు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 న మండల కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలె క్టర్ కోరారు. ఐటీడీఏ పీవో బి. రాహుల్, జిల్లా అట వీ అధికారి అనూప్ అగర్వాల్, సుడా చైర్మ న్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డీసీవో గంగాధర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, ఇరిగే షన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, పిఆర్ ఈఈ మహేష్ బాబు, రఘునాథపాలెం మండల ఎంపీడీవో అశోక్ కుమార్, తహసీల్దార్ శ్వేత, గ్రామ సర్పంచ్ మూడ్ చిన్న పాల్గొన్నారు.

# శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

శ్రీశైలం ప్రాజెక్టులో జలవిద్యుత్ ఉత్పత్తిపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) తెలంగాణ ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014లోని 11వ షెడ్యూల్‌లోని నిబంధనల ప్రకారం కృష్ణా జలాల లభ్యత, వినియోగాన్ని ఇరు రాష్ట్రాలు క్రమబద్ధీకరించుకోవాలని సూచించింది.

**ఏపీ ఫిర్యాదుతో సమీక్ష**

శ్రీశైలం ఎడమగట్టు కేంద్రంలో తెలంగాణ నిరంతరంగా విద్యుత్ ఉత్పత్తి చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసింది. విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని దిగువకు విడుదల చేయడంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గుతోందని ఏపీ ప్రభుత్వం పేర్కొంది. దీంతో రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల తాగునీటి అవసరాలకు ముప్పు ఏర్పడుతోందని తెలిపింది.

**తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత**

ఫిర్యాదును సమీక్షించిన కేఆర్ఎంబీ.. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కొనసాగడం రెండు రాష్ట్రాల తాగునీటి భద్రతకు కీలకమని పేర్కొంది. వర్షాభావ పరిస్థితులు, నీటి కొరత వంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినప్పుడు సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కంటే ప్రజల తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**

వేసవి సమీపిస్తున్న సమయంలో లేదా నీటి నిల్వలు తగ్గుతున్నప్పుడు కృష్ణా జలాల వినియోగంలో ఇరు రాష్ట్రాలు సంయమనం పాటించాలని బోర్డు సూచించింది. తాగునీటి అవసరాలను పక్కనపెట్టి సాగు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వకూడదని తేల్చిచెప్పింది. కేఆర్ఎంబీ నియంత్రణ ఆదేశాలను ఉల్లంఘిస్తే ప్రాజెక్టుల వద్ద నీటి నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# భద్రాద్రి ఆలయ పనులు త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి పొంగులేటి

**భద్రాచలం, సెప్టెంబర్ 4 :**

వొచ్చే డిసెంబర్ లో జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లోపు ఆలయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని, వొచ్చే ఏడాది శ్రీరామనవమి ఉత్సవాల్లోపు అన్ని పనులు పూర్తయ్యాలా చర్యలు చేపట్టాలని మంత్రి పొం గులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. భద్రాద్రి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని శుక్రవారం దర్శించు కున్నారు. కలెక్టర్ అంకిత్, భద్రాచలం, ఎ మ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్, పాయం వెంక టేశ్వర్లు, జారే ఆదినారాయణతో కలసి పూజలు చేశారు.అనంతరం దేవాలయం లో చిత్రకూట మండపం పరిసరాలు, గోశాల ప్రాంతాలు,అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాల యానికి వెళ్లే మార్గం, ఉత్తర ద్వార దర్శనం, రామాలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వచ్చే ఏడాది 2027 జూన్ జులై నెలలో జరిగే గోదావరి పుష్కరాల ప్రారం భంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రు. 276 కోట్ల నిధులు ఆలయ పరిసరాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.



# సీఎం భద్రతా వివరాల లీక్‌పై కేసు

- తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై సైబర్ క్రైమ్ దర్యాప్తు
- జెడ్ ప్లస్ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారం బహిర్గతం
- ఖైరతాబాద్ నుంచి సైబర్ క్రైమ్‌కు బదిలీ
- అధికారిక వైర్‌లెస్ సందేశం లీక్‌పై విచారణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు సంబంధించిన అత్యంత సున్నితమైన భద్రతా వివరాలు సోషల్ మీడియాలో బహిర్గతం కావడంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతా నిర్వాహకులపై ఈ కేసు నమోదైనట్లు సమాచారం. సీఎం ప్రధాన భద్రతాధికారి కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**వైర్‌లెస్ సందేశం లీక్**

జూన్ 13న సీఎం ఢిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ షెడ్యూల్, భద్రతా ఏర్పాట్ల వివరాలను ఢిల్లీ పోలీసు జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ సహా పలువురు ఉన్నతాధికారులకు వైర్‌లెస్ సందేశం ద్వారా పంపినట్లు సీఎస్‌వో ఫిర్యాదులో పేర్కొన్నారు. జెడ్ ప్లస్ భద్రతకు అనుగుణంగా రూపొందించిన ఈ సమాచారంలో సీఎం రక్తవర్గం, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి సున్నితమైన వివరాలు కూడా ఉన్నట్లు తెలిపారు.

**ఎక్స్ ఖాతాలో ప్రత్యక్షం**

సీఎం ఢిల్లీ పర్యటన కొనసాగుతుండగానే ఈ రహస్య సమాచారాన్ని 'తెలుగు స్క్రైబ్' ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వైర్‌లెస్ సందేశాలను బహిర్గతం చేయడం నిబంధనలకు విరుద్ధమని, అధికారుల్లో ఎవరో ఈ సమాచారాన్ని అక్రమంగా సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉండవచ్చని సీఎస్‌వో అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**సైబర్ క్రైమ్‌కు కేసు బదిలీ**

ఈ వ్యవహారంపై తొలుత ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర దర్యాప్తు కోసం కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీరిజిస్టర్ చేసినట్లు సమాచారం. భద్రతా సమాచారం సోషల్ మీడియాకు ఎలా చేరింది, దాన్ని ఎవరు అందించారు అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సమ్మక్క సాగర్‌కు త్వరగా ఎన్‌ఓసీ ఇవ్వాలి

- ఛత్తీస్‌గఢ్ సీఎంను కోరిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :**



సమ్మక్క-సారక్క బ్యారేజీగా పిలిచే సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతిని (ఎన్‌ఓసీ) వీలైనంత త్వరగా జారీ చేయాలని నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కోరారు. న్యూఢిల్లీలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశమై ప్రాజెక్టుపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, ఇళ్లకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం చెల్లిస్తుందని, అవసరమైతే పరిహార నిధులను ముందుగానే జమ చేసేందుకు కూడా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, పరస్పర సహకారం, సంప్రదింపుల ద్వారా పెండింగ్ అంశాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. సమ్మక్క సాగర్‌కు సంబంధించిన బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపునకు గురయ్యే భూములు, నివాస గృహాలు, బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఛత్తీస్‌గఢ్ నుంచి రావాల్సిన ఎన్‌ఓసీపై విస్తృతంగా చర్చించారు. ముంపు ప్రభావిత కుటుంబాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా అమలులో ఉన్న నిబంధనల ప్రకారం భూములు, ఇళ్లు, ఇతర ఆస్తులకు పరిహారాన్ని అంచనా వేసి పూర్తిస్థాయిలో చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీలో పూర్తి జలాశయ మట్టం వరకు నీటిని నిల్వ చేసి, నిర్దేశిత సాగునీటి ప్రయోజనాలను రైతులకు అందించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సహకరించాలని కోరారు.

**సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ప్రత్యేకతలు**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించారు. బ్యారేజీ పొడవు 1,143 మీటర్లు కాగా, 59 రేడియల్ గేట్లను ఏర్పాటు చేశారు. పూర్తి జలాశయ మట్టం +83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా రూపొందించారు. సాగునీటి అవసరాల కోసం గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.

**ఆయకట్టు స్థిరీకరణ – నీటి పంపకాలు**

అసలు నీటి వనరు నుంచి తగినంత నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టు రెండో దశ పరిధిలోని 5 జిల్లాల ఆయకట్టును స్థిరీకరించనున్నారు. సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాలు, రామప్ప-పాకాల అనుసంధాన కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో 22,000 ఎకరాల కొత్త ప్రాంతాలకు సాగునీరు అందించనున్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పరిధిలోని కొంత ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు మార్గమధ్యంలోని గ్రామాల తాగునీటి అవసరాలను కూడా తీర్చనున్నారు.

**ప్రాజెక్టు నేపథ్యం & అనుమతుల ప్రస్థానం**

2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పి.వి.నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకానికి అనుమతి లభించింది. 2017లో రీఇంజినీరింగ్‌లో భాగంగా బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని తుపాకులగూడెంకు మార్చి పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. 2020లో ప్రాజెక్టుకు 'సమ్మక్క సాగర్'గా నామకరణం చేసి పర్యావరణ అనుమతులు సాధించారు. 2021లో సమగ్ర ప్రాజెక్టు నివేదికను కేంద్ర జల సంఘానికి సమర్పించారు. 2024 డిసెంబర్‌లో సవరించిన పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయి. సాంకేతిక అనుమతులు వచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌ఓసీ రాకపోవడంతో అంతర్రాష్ట్ర అంశాల పరిశీలన పెండింగ్‌లో ఉంది.

**రూ. 9.883 కోట్లతో బ్యాక్‌వాటర్ అధ్యయనం**

సమ్మక్క సాగర్ వల్ల ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే బ్యాక్‌వాటర్ ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ. 9.883 కోట్లను ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు చెల్లించింది. డీజీపీఎస్ సర్వేలు పూర్తయినట్లు ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ తెలియజేసింది. ప్రస్తుతం లైడార్ డ్రోన్ సర్వేలు, క్షేత్రస్థాయి సమాచార సేకరణ కొనసాగుతున్నాయని, వీటి ఆధారంగా ముంపు ప్రభావిత ప్రాంతాలు, భూములు, ఆస్తుల వివరాలను నిర్ధారించి పరిహార ప్రక్రియ చేపడతారు. రెండు రాష్ట్రాల మధ్య నిరంతర సంప్రదింపుల ద్వారా పెండింగ్ అంశాలను పరిష్కరించి సమ్మక్క సాగర్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



# ఎయిర్ పోర్టును ముంచెత్తిన వరద

- దిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ

**దిల్లీ, సెప్టెంబర్ 4 :**

దేశ రాజధాని ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో నీరు సగటున చేరింది. మోకాలి లోతులో వరద నీరు నిలిచి పోయింది. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నే షనల్ ఎయిర్పోర్టును కూడా వరద నీరు ముంచెత్తింది. దీంతో విమానాల రాకపోలకు ఇబ్బంది ఎదురవుతోంది. విమానాలు 17 నిమిషాలు ఆలస్యంగా నడు స్తున్నాయి. సాయంత్రం రావాల్సిన పలు విమానాలను అధికారులు దారి మళ్లించారు. ఎయిర్పోర్టులో నీరు చేరిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఢిల్లీతో పాటు హరియాణా, చండీగఢ్ ప్రాంతాల్లో, యూపీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు ఐఎండీ పేర్కొంది. ఈశాన్య మధ్యప్రదేశ్లో అల్పపీడన ద్రోణి కారణంగా సెంట్రల్ ఇండియాలో వర్షాలు కురుస్తున్నాయి.

# నేపాల్ బాధితులకు అండగా నిలిచిన సోనూసూద్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :**



తీవ్ర వరదలతో అల్లాడుతున్న నేపాల్ ప్రజలను ఆదుకునేందుకు ప్రముఖ నటుడు, రియల్ హీరో సోనూసూద్ రంగంలోకి దిగారు. బాధితులకు అవసరమైన దుప్పట్లు, ఆహార పదార్థాలు, ఇతర నిత్యావసర సరుకులను భారత్ నుంచి తరలించి క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే, సోనూసూద్ నేపాల్ పర్యటనపై ప్రముఖ జర్నలిస్ట్ అజిత్ అంజుమ్ సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించారు. పనులు ఇంకా ప్రారంభం కాకముందే ఆయనను దేవుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేసుకోవడం కేవలం సెల్ఫ్ మార్కెటింగ్ అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టడం కలకలం రేపింది. అయితే ఈ ప్రతికూల విమర్శలపై సోనూసూద్ ఎంతో హుందాగా, సానుకూలంగా స్పందించారు. 'సోదరా.. మీ మనసు చాలా మంచిది. మీరు నేపాల్‌కు రండి, మన మిద్దరం కలిసి ప్రజలకు అండగా నిలబడి సాయం చేద్దాం' అంటూ రీట్వీట్ చేశారు. సోనూసూద్ చూపించిన ఈ సంస్కారం, పరిణతిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా, త్రిశూలి నది పరివాహక ప్రాంతాల్లో వరద విధ్వంసం తీవ్రంగా ఉందని, బాధితుల ఇళ్లను పునర్నిర్మించి వారు సాధారణ జీవితం గడిపే వరకు కొన్ని నెలలపాటు తమ సూద్ ఫౌండేషన్ తరపున సహాయక చర్యలు కొనసాగుతాయని సోనూసూద్ స్పష్టం చేశారు. పరాయి దేశంలోనూ మానవత్వాన్ని చాటుకుంటూ ఆయన అందిస్తున్న సేవలకు అంతటా అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

# డిజిటల్ అరెస్ట్ ముఠాపై సీబీఐ ఉక్కుపాదం

- 20 రాష్ట్రాల్లో 89 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- మూడు కేసుల్లో రూ.42.36 కోట్ల దోపిడీ
- ముగ్గురు కీలక నిందితుల అరెస్ట్
- భారీగా బ్యాంకింగ్, డిజిటల్ ఆధారాలు స్వాధీనం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ సైబర్ నేరాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) భారీ ఆపరేషన్ చేపట్టింది. 'ఆపరేషన్ చక్రVI'లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కీలక నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీగా డిజిటల్ పరికరాలు, బ్యాంకింగ్ పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సైబర్ నేరగాళ్లు, వారి నెట్‌వర్క్‌పై దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది.

**మూడు కేసుల్లో రూ.42.36 కోట్ల దోపిడీ**

పోలీసులు, ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకుని బాధితులను నెలల తరబడి ఆన్‌లైన్‌లో బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేసిన మూడు కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఈ మూడు ఘటనల్లో బాధితులను ఒకటి నుంచి మూడు నెలల వరకు భయభ్రాంతులకు గురిచేసి మొత్తం రూ.42.36 కోట్లు కాజేసినట్లు గుర్తించింది. బిట్స్ పిలానీకి చెందిన ఓ బాధితుడి నుంచి మూడు నెలల్లో రూ.7.67 కోట్లు, గుజరాత్‌కు చెందిన వ్యక్తి నుంచి మూడు నెలల్లో రూ.19.24 కోట్లు, కర్ణాటకకు చెందిన మరో బాధితుడి నుంచి నెల రోజుల్లో రూ.15.45 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది.



**89 ప్రాంతాల్లో సోదాలు**

బాధితుల నుంచి దోచుకున్న నగదు ఎక్కడికి మళ్లించారు? నేరాల వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు? అనే అంశాలపై సీబీఐ దృష్టి సారించింది. బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన అధికారులు 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక బ్యాంకింగ్ పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

**ముగ్గురు కీలక నిందితుల అరెస్ట్**

మనీ లాండరింగ్, నగదు మళ్లింపు వ్యవహారాల్లో పాత్ర ఉన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. హర్యానాకు చెందిన ఆకాష్ తన బ్యాంకు ఖాతాలోకి రూ.1.95 కోట్లు జమ చేయించుకుని అదే రోజు ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు గుర్తించారు. కోల్‌కతాకు చెందిన రాజా కర్మాకర్ సంస్థ ఖాతాలోకి రూ.1.5 కోట్లు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. జ్యోతి రాణి తన ఖాతాలోకి వచ్చిన నగదులో కొంత మొత్తాన్ని విత్‌డ్రా చేసి, మిగతా మొత్తాన్ని ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న మరిన్ని నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు సీబీఐ దర్యాప్తును వేగవంతం చేసింది.

# నేపాల్‌టిబెట్ వరదల్లో 275 మంది భారతీయులు గల్లంతు

- 166 మందిని సురక్షితంగా రక్షించిన భారత్
- విపత్తులో 1,308 మంది మృతి.. 5,624 మంది గల్లంతు
- టిబెట్ నుంచి నేపాల్‌లోకి 1,907 మంది భారతీయులు
- 9 రోజుల తర్వాత ఇద్దరు కార్మికులు సజీవంగా



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

నేపాల్‌టిబెట్ సరిహద్దులో భారీ వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 275 మంది భారతీయులు గల్లంతైనట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. ఇప్పటివరకు నేపాల్‌లో 166 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం నేపాల్ ప్రభుత్వం, ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు భారత్‌లోని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

**రక్షణ చర్యలు ముమ్మరం**

రక్షించిన 166 మంది భారతీయుల పేర్లను విదేశాంగ శాఖ ఎప్పటికప్పుడు వెల్లడిస్తోందని జైస్వాల్ తెలిపారు. సహాయక చర్యల్లో నేపాల్ అధికారులు చేస్తున్న కృషిని భారత్ అభినందిస్తోందన్నారు. చైనా నుంచి 1,907 మంది భారతీయులు సురక్షితంగా నేపాల్‌లోకి చేరుకున్నట్లు తెలిపారు. టిబెట్ అటానమస్ రీజియన్‌లో భారతీయ ప్రయాణికులు ఎవరూ చిక్కుకుపోలేదని చైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు.

**భారీగా ప్రాణ నష్టం**

నేపాల్, టిబెట్‌లో సంభవించిన ప్రకృతి విపత్తులో ఇప్పటివరకు 1,308 మంది మరణించగా.. మరో 5,624 మంది గల్లంతైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నేపాల్‌లో 1,287 మంది మృతి చెందగా, 5,083 మంది ఆచూకీ తెలియడం లేదు. టిబెట్‌లో 21 మంది మరణించగా, 541 మంది గల్లంతైనట్లు చైనా అధికారిక మీడియా వెల్లడించింది. హిమాలయ ప్రాంతాల్లో ట్రెక్కింగ్, యాత్రలకు వెళ్లినవారితో పాటు 800 మందికి పైగా విదేశీయులు గల్లంతైనట్లు సమాచారం.

**9 రోజుల తర్వాత సజీవంగా**

వరదలు, కొండచరియలు, మట్టి, రాళ్లతో దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేపాల్‌లోని త్రిశూలి 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలోని ఓ సొరంగంలో తొమ్మిది రోజులుగా చిక్కుకుపోయిన ఇద్దరు కార్మికులను సజీవంగా గుర్తించారు. సంజయ్ షా, కబీర్ మహర్జన్‌లను సొరంగం నుంచి బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. సొరంగ మార్గాల్లో భారీగా మట్టి, రాళ్లు పేరుకుపోవడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయని నేపాల్ ఆర్మీ కల్నల్ ఝబీంద్ర రేష్మి తెలిపారు. నీటిని బయటకు పంపడంతో పాటు శిథిలాలను తొలగిస్తూ మరెవరైనా సజీవంగా ఉన్నారా అనే కోణంలో గాలింపు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

**ఆగస్టు 26న విపత్తు**

నేపాల్‌టిబెట్ సరిహద్దు సమీపంలో ఆగస్టు 26న మంచు పొరలు లేదా హిమనదీ ప్రాంతం కూలిపోవడంతో భారీగా నీరు, మంచు, రాళ్లు, మట్టి నదీ వ్యవస్థలోకి ప్రవహించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రవాహం లోయల గుండా నేపాల్, టిబెట్ ప్రాంతాలకు చేరుకుని భారీ విధ్వంసం సృష్టించింది. ఇళ్లు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా త్రిశూలి నది లోయ తీవ్రంగా ప్రభావితమైంది.

**భారత్ భారీగా సహాయం**

నేపాల్‌లో సహాయక చర్యలకు భారత్ మద్దతు కొనసాగిస్తోంది. భారత్ పంపిన ఐదో సహాయక విమానం 11 మంది సభ్యులతో కూడిన రెస్క్యూ బృందం, ప్రత్యేక పరికరాలు, 5.5 టన్నుల వైద్య సామగ్రిని నేపాల్‌కు తీసుకెళ్లింది. భారత రెస్క్యూ బృందాలు నేపాల్ అధికారులతో కలిసి సహాయక, పునరావాస చర్యల్లో పాల్గొంటున్నాయి. ప్రాణాలతో ఉన్నవారి కోసం గాలింపు, మృతదేహాల వెలికితీతలోనూ సహకరిస్తున్నాయి.

# పసిడి ధరలకు మళ్లీ రెక్కలు

- హైదరాబాద్‌లో ఒక్కరోజే రూ.1,310 పెరుగుదల
- 10 గ్రాముల 24 క్యారెట్ల ధర రూ.1,56,660
- 22 క్యారెట్ల ధర రూ.1,43,600కు చేరిక
- రెండు రోజుల్లో రూ.4,640 వరకు పెరిగిన ధర



**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

పసిడి ధరలు మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో వరుసగా ధరలు ఎగబాకుతుండటంతో కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంది. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 పెరిగి రూ.1,56,660కు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,210 మేర పెరిగి రూ.1,43,610 వద్ద నమోదైంది.

**రెండు రోజుల్లో భారీ పెరుగుదల**

కేవలం రెండు రోజుల వ్యవధిలోనే 10 గ్రాముల పసిడి ధర రూ.4,640 వరకు పెరగడం గమనార్హం. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వినియోగదారులు ధరల పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.

**అంతర్జాతీయ ప్రభావం**

అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరల పెరుగుదల దేశీయ మార్కెట్‌పైనా ప్రభావం చూపుతోంది. అమెరికా ద్రవ్య విధానం, డాలర్ విలువ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు పసిడి ధరల కదలికలను ప్రభావితం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ పెరగడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

**పండగలు, పెళ్లిళ్ల వేళ భారం**

పండగలు, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న సమయంలో పసిడి ధరలు ఈ స్థాయిలో పెరగడం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపనుంది. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ల కదలికలు, డాలర్ విలువ, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు బంగారం ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వీధికుక్కే రక్షణగా నిలిచింది

**కోయంబత్తూరు, సెప్టెంబర్ 4:**

తమిళనాడులోని కోయంబత్తూరులో ఓ వీధికుక్క చూపిన చొరవ చర్చనీయాంశంగా మారింది. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళపై లైంగిక దాడికి యత్నించిన 17 ఏళ్ల బాలుడిని ఆ శునకం అడ్డుకుని ఆమెను కాపాడింది. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాలో నమోదయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో శునకంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

**అర్ధరాత్రి ఘటన**

కోయంబత్తూరు సమీపంలోని తుడియలూరు రైల్వే ఓవర్‌బ్రిడ్జి సర్వీస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఓ మహిళ వీధికుక్క సమీపంలో కూర్చుని ఉండగా, మద్యం మత్తులో ఉన్న 17 ఏళ్ల బాలుడు అక్కడికి వచ్చాడు. తొలుత శునకాన్ని అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించిన అతడు.. అనంతరం మహిళపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో శునకం అప్రమత్తమైంది.

**బాలుడిని తరిమిన శునకం**

మహిళ అరుపులు విన్న వెంటనే శునకం బాలుడిపై దాడి చేసింది. అతడి కాళ్లను కరవడంతో భయపడిన బాలుడు అక్కడి నుంచి పరుగులు తీశాడు. శునకం కొంత దూరం వరకు అతడిని వెంటాడి తరిమికొట్టింది. ఈ మొత్తం ఘటన సమీపంలోని సీసీటీవీ కెమెరాలో నమోదైంది.

**నిందితుడు అరెస్ట్**

సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అదే రోజు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరచగా.. న్యాయస్థానం అతడిని అబ్జర్వేషన్ హోంకు తరలించింది. ఘటనపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**నెటిజన్ల ప్రశంసలు**

ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. నిస్సహాయురాలైన మహిళను కాపాడేందుకు శునకం స్పందించిన తీరును ప్రశంసిస్తున్నారు.

# క్రీడాకారిణిపై ఏఐ వేధింపులు

- వేలాది అసభ్యకర చిత్రాలతో కేయా కునాల్ బెనర్జీకి వేధింపులు
- డిజిటల్ వేధింపులపై కఠిన చర్యలకు డిమాండ్
- మహిళా క్రీడాకారిణుల భద్రతపై ఆందోళన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4 :**

ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ మహిళా క్రీడాకారిణులను ఆన్‌లైన్‌లో వేధిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా 140 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో క్రీడా వర్గాల్లో గుర్తింపు పొందిన 21 ఏళ్ల భారత పవర్‌లిఫ్టర్ కేయా కునాల్ బెనర్జీ ఆన్‌లైన్ లైంగిక వేధింపులకు గురయ్యారు. తన ముఖం, శరీరాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా రూపొందించిన వేలాది అసభ్యకర, అభ్యంతరకర చిత్రాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతిభను పక్కనపెట్టి వేధింపులు**

క్రీడారంగంలో ప్రతిభను చాటుకుని దేశానికి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో కష్టపడుతున్న సమయంలో ఇలాంటి డిజిటల్ వేధింపులు తనను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని కేయా పేర్కొన్నారు. తన విజయాలను గుర్తించి ప్రోత్సహించాల్సిన సమయంలో కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో అసభ్యకర కంటెంట్‌ను ప్రచారం చేయడంతో పాటు వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

**ఏఐ దుర్వినియోగంపై ఆందోళన**

తనపై జరుగుతున్న ఆన్‌లైన్ వేధింపులు నిరంతరం కొనసాగుతున్నాయని, దీంతో తీవ్ర అసౌకర్యం, ఇబ్బందిని ఎదుర్కొంటున్నానని కేయా వెల్లడించారు. ఏఐ సాంకేతికతను తప్పుడు మార్గాల్లో ఉపయోగించి మహిళా క్రీడాకారిణుల గౌరవానికి భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కఠిన చర్యలకు డిమాండ్**

మహిళల ముఖాలు, శరీరాలను ఉపయోగించి నకిలీ అసభ్యకర చిత్రాలను రూపొందించి ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రీడాభిమానులు, నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఏఐ ఆధారిత దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు మహిళా క్రీడాకారిణులకు ఆన్‌లైన్‌లో భద్రత కల్పించేందుకు కఠిన చర్యలు అవసరమని కోరుతున్నారు.

# మెలోనికి మోదీ శుభాకాంక్షలు

- భారత్-ఇటలీ బంధం మరింత బలోపేతం
- చారిత్రక ఘనత సాధించిన ఇటలీ ప్రధాని
- మెలోని నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- మోదీకి కృతజ్ఞతలు తెలిపిన మెలోని

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

ఇటలీ యుద్ధానంతర చరిత్రలో అత్యంత సుదీర్ఘ కాలం వరుసగా ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నేతగా జార్జియా మెలోని రికార్డు సృష్టించారు. ఈ చారిత్రక ఘనతపై ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై స్పందించిన మెలోని.. భారత్‌ఇటలీ సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**మోదీకి మెలోని ధన్యవాదాలు**

తనకు శుభాకాంక్షలు తెలిపిన మోదీకి మెలోని ఎక్స్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. మోదీతో ఉన్న స్నేహాన్ని ప్రస్తావిస్తూ.. భారత్, ఇటలీ మధ్య సంబంధాలు ప్రస్తుతం అత్యంత బలమైన స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవల ప్రారంభించిన ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సంబంధాలకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు.

**కొత్త అవకాశాలకు భాగస్వామ్యం**

భారత్, ఇటలీకి చెందిన నైపుణ్యాలను పరస్పరం అనుసంధానించడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించేందుకు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం దోహదపడుతుందని మెలోని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించేందుకు ఈ భాగస్వామ్యం కీలకంగా మారుతుందని తెలిపారు.

**మెలోనికి మోదీ అభినందనలు**

మెలోని సాధించిన చారిత్రక ఘనత ఇటలీ ప్రజలు ఆమె నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని మోదీ పేర్కొన్నారు. భారత్‌ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో మెలోని స్నేహం కీలకంగా ఉందన్నారు. రెండు దేశాల ప్రజల కోసం సంపన్నమైన భవిష్యత్తును నిర్మించేందుకు ఆమెతో కలిసి సన్నిహితంగా పనిచేయాలని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. మెలోని భవిష్యత్తు విజయాలకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.



# కల్యాణలక్ష్మి తులం బంగారం ఏదీ..?

- హామీలు ఇచ్చి మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- తులం బంగారం ఇచ్చే వరకు కాంగ్రెస్ నేతలకు పెళ్లి పిలుపులు బంద్!
- మహిళల పక్షాన బీఆర్ఎస్ పోరాటం ఉధృతం చేస్తాం: కోరుకంటి చందర్



**శెనార్తి మీడియా గోదావరిఖని:**

ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బారాస రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కళ్యాణలక్ష్మి పథకం కింద ప్రకటించిన తులం బంగారాన్ని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ నాయకులను పెళ్లి వేదికలపైకి ఆహ్వానించవద్దని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మూల విజయారెడ్డి నేతృత్వంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో భారీ వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళా సదస్సు ఏర్పాటు చేసి ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, 33 నెలలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.82,500 బాకీ పడిందని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్లు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను కూడా విస్మరించిందన్నారు. "ఆడపిల్ల పెళ్లికి వచ్చి ఫొటోలు దిగడం కాదు.. ముందుగా తులం బంగారం ఇవ్వాలి" అంటూ కాంగ్రెస్ నేతలపై చందర్ మండిపడ్డారు. రామగుండం నియోజకవర్గంలోని ప్రతి వార్డు, గ్రామంలో జరిగే ఆడపిల్లల వివాహాలకు కాంగ్రెస్ నాయకులకు పిలుపులు ఇవ్వడాన్ని నిలిపివేయాలని సూచించారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం అందించిన తర్వాతే వారిని పెళ్లిళ్లకు ఆహ్వానించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అమలు చేసిన కళ్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలిచాయని చందర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను కేవలం ప్రచారానికే పరిమితం చేసిందని విమర్శించారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, ఉచిత స్కూటర్లు, పెన్షన్ల పెంపు తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, నాయకులను ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని స్పష్టం చేశారు. మహిళల సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు చేపట్టి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూల విజయారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్ రావు, హరీష్ రెడ్డి, మహేష్, కర్క పద్మజ, రమేష్, కిషన్ రెడ్డి, నారాయణ, మేకల సమ్మన్న, తస్నిమ్ భాను, అనుముల కళావతి, పర్ష స్వాతి, బోడకుంట వెంకటలక్ష్మి, శాంతిలక్ష్మి, కృష్ణవేణి, రంగు దుర్గాప్రసాద్, కంకల దేవేందర్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం



**శెనార్తి మీడియా,శంకరపట్నం:**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి, సంత్ రవిదాస్ చిత్రపటాన్ని అవమానించడాన్ని నిరసిస్తూ కేశవపట్నం మండల కేంద్రంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. మండల అధ్యక్షుడు కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమ్మిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. నల్గొండలో బీజేపీ క్యాంపు కార్యాలయం, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై దాడిని ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏనుగుల అనిల్ మాట్లాడుతూ బీజేపీ సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో దండు కొమురయ్య, దొంగల రాములు, దాసరపు నరేందర్, వెన్నం మల్లేశం, కొయ్యడ కుమార్‌యాదవ్, జంగ జైపాల్, కొయ్యడ అశోక్‌యాదవ్, నిమ్మచెట్టు సంపత్‌రావు, ఎలుకపెల్లి సంపత్, రాసమల్ల శ్రీనివాస్, గౌరవేణి శ్రీనివాస్, బిజిలి సారయ్య, బోడ తిరుపతిరెడ్డి, చర్ల అనిత, బొజ్జ సాయి ప్రకాష్, పలకల రాజిరెడ్డి, మందాడి జగ్గారెడ్డి, జానపట్ల రాజిరెడ్డి, దాసరి సంపత్, చర్ల శ్రీనివాస్, శివారెడ్డి, వీరా అర్జున్, రంజిత్, శ్రీనాథ్, కుమార్, వికాస్, సాయి, మైపాల్‌తో పాటు బీజేపీ మండల, ఎస్సీ మోర్చా నాయకులు, శక్తికేంద్ర ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయుడిగా సంపత్ ఎంపిక

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన ఉడుత సంపత్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. హుజురాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా విధులు నిర్వహిస్తున్న సంపత్‌కు 2026–27 సంవత్సరానికి కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన 35 మంది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో చోటు దక్కింది. ఈ సందర్భంగా మెట్టుపల్లి గ్రామంలో సంపత్‌ను పలువురు అభినందించారు.




## ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా నీరజ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మొలంగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో 'విద్యాసారథి' పురస్కారంతో ఘనంగా సన్మానం చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ డీవైసీఈవో రాము, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. పాఠశాల విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల ప్రగతి కోసం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోలాడి లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి మధుసూదనచారి, రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాష్, ప్రభాకరరావు నీరజ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి 'విద్యాసారథి' పురస్కారంతో గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఆమెను గ్రామ సర్పంచ్ పూదరి రాజు, ఉప సర్పంచ్ దండు రాజేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పంచాయతీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.







# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, మొలంగూర్, కొత్తగట్టు, లింగాపూర్, కరీంపేట గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కన్నాపూర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ విఘ్నేశ్వర మహిళా భజన భక్తుల ఆధ్వర్యంలో చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం మహిళలు భజన కార్యక్రమంలో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. చిన్నారుల ఉట్టి కొట్టే కార్యక్రమం, మహిళల భజనలతో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది.







## మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటన

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కన్నాపూర్ సర్పంచ్ నూనె రమా శ్రీనివాస్ కుమార్తె వివాహం కేశవపట్నంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరుగగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరయ్యారు. అనంతరం కొత్తగట్టు గ్రామంలో జాతీయ రహదారి పరిస్థితులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రహదారితో తలెత్తుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు కాలికి గాయమైన బీఆర్ఎస్ దేవస్థాన మాజీ డైరెక్టర్ ఉమ్మెత్తుల సుగుణాకర్‌రెడ్డిని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్, మాజీ జెడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మాడ సుజాత రాజిరెడ్డి, హుజురాబాద్ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, పూదరి రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ బాకీ కార్డులు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**




కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు చేసుకోవడం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గన్నేరువరం మండల కేంద్రంలో శుక్రవారం గంప వెంకన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ న్యాత సుధాకర్, పుల్లెల లక్ష్మణ్, మీసాల ప్రభాకర్, భూమయ్య, బూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 22ఏ జాబితాపై హరీశ్‌రావు ఆగ్రహం

**శెనార్తి మీడియా , మంచిర్యాల:**



శెనార్తి మీడియా, మంచిర్యాల:22ఏ నిషేధిత జాబితా పేరుతో సామాన్యుల ఆస్తులను బ్లాక్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్న ఇళ్లు, ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన భూములు, రిజిస్ట్రేషన్ చేసిన ఆస్తులను 22ఏలో చేర్చడం సరికాదన్నారు. ప్రభుత్వం చేసిన తప్పుకు బాధితులే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ఏమిటని ప్రశ్నించారు.మంచిర్యాల మార్కెట్ ఏరియాలో నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. 22ఏ జాబితాలోని 98 శాతం ఆస్తులను తొలగించామని ప్రభుత్వం చెబుతున్నా మంచిర్యాలలో వేలాది ఇళ్లు ఇంకా సమస్యను ఎదుర్కొంటున్నాయని అన్నారు. జిల్లాలో 22ఏలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, దుకాణాలు, తొలగించిన ఆస్తుల పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఆస్తిని 22ఏ జాబితా నుంచి తొలగించగలిగినప్పుడు సామాన్యుల ఆస్తులను ఎందుకు తొలగించలేరని ప్రశ్నించారు. ప్రభుత్వం డబ్బులు తీసుకుని రిజిస్టర్ సేల్‌డీడ్లు ఇచ్చిన 6,222 మంది సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాలను 22ఏలో చేర్చడంపై సమాధానం చెప్పాలని కోరారు. మంచిర్యాల జిల్లాలో 5,525 ఎకరాల నాన్-అగ్రికల్చర్ భూములు 22ఏలో ఉన్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే 10 వేల బాధిత కుటుంబాలతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తుతామని హరీశ్‌రావు తెలిపారు.



# తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి

## నేడు పురుషోత్తమ చౌదరి జయంతి

ఆంధ్రక్రైస్తవ సంకీర్తనా పితామహులు, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడు అని పిలువబడే కవిశేఖరుడు చౌదరి పురుషోత్తం పేరు వినని, ఆయన పాట గానం చేయని తెలుగు క్రైస్తవులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ప్రముఖ వాగ్గేకారుల, ముఖ్యంగా త్యాగరాయ కృతులతో గేయకవిత శిఖరాయమాన ప్రాభవాన్ని సంతరించుకొన్న 19వ శతాబ్దిలో, హిందూ దేవుళ్ళనే కీర్తించేందుకు కృతులుగాని, కీర్తనలు గాని కోకొల్లలుగా జన బాహుళ్యానికి అందుబాటులోకి వచ్చిన తరుణంలో 19వ శతాబ్ది పూర్వార్ధంలోనే మొట్ట మొదటి సారిగా అన్య మతానికి చెందిన దేవుని కీర్తించేందుకు కీర్తనలను రచించిన కవి పురుషోత్తమ చౌదరి. 19వ శతాబ్దిలో క్రైస్తవ మతాన్ని స్వీకరించి, మనసా, వాచా, కర్మణా, క్రైస్తవ మత ప్రచారార్థం రచనలు చేసిన తొలి తెలుగు క్రైస్తవ కవి పురుషోత్తమ చౌదరి. అనేక క్రైస్తవ పద్య కృతులను, కీర్తనలను రచించి ఆంధ్రక్రైస్తవ సార్వభౌముడు'గా ఖ్యాతి నొందారు. పురుషోత్తం చౌదరి (సెప్టెంబరు 5, 1803 – ఆగష్టు 23, 1890) తెలుగు క్రైస్తవ పదకవితా పితామహుడు. తొలి తెలుగు క్రైస్తవ వాగ్గేయకారులు. సి.పి. బ్రౌన్, త్యాగరాజుకు సమకాలికులు. తాను రాసిన కీర్తన లను స్వయంగా గానం చేస్తూ ప్రజా బాహుళ్యానికి అందించారు. శ్రీకాకుళం జిల్లా తెంబూరు (పాతపట్నం) శివారు మదనాపురం (తెంబూరు (పాతపట్నం) లో 1803, సెప్టెంబరు 5 న బెంగాలీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సుభద్రాదేవి, కూర్మానాథ చౌదరి దంపతులకు జన్మించారు. తల్లివీరి పూర్వీకులు పశ్చిమ బెంగాలు నుండి ఒరిస్సా ప్రాంతానికి వచ్చి స్థిరపడిన బెంగాల్ బ్రాహ్మణులు. తమ మతాచారాల ప్రకారం పురుషోత్తమ చౌదరికి ఏడు సంవత్సరాలప్పుడే ఉపనయన సంస్కారం జరిపి, గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించారు. పురుషోత్తం చౌదరి బాల్యం నుండే మతనిష్ట కలిగి ఉండేవారు. నిరంతర విగ్రహారాధన, తీర్థ యాత్రలతో పాటు భుజాలపై వైష్ణవ మత సూచకాలైన శంఖు చక్రాల్ని కూడ కాల్పించు కొన్నారు. 1823 లో తన మేనమామ కుమార్తె యైన రాధామణి దేవిని వివాహం చేసికొన్నారు. సంస్కృతం, ఒరియా, తెలుగు భాషల్లో ప్రావీణ్యతను సంపాదించి, 20 సంవత్సరాలకే కవిత్వం రాయడం ఆరంభించారు. క్రైస్తవ్యాన్ని స్వీకరించక మునుపు చాలా హిందూ మత సంబంధిత భక్తి రచనల్ని చేశారు. ఆయన తన అన్న గారి పాఠశాలలో పనిచేస్తుండే వారు. అప్పుడే క్రైస్తవ్యం పట్ల ఆసక్తి కలిగి, దాని గురించి తెలుసు కోవాలనే తపనతో అన్వేషించడం మొదలు పెట్టారు. అదే సమయంలో ఆధునిక ప్రేషిత పితామహుడుగా పేరుగాంచిన విలియమ్ కేరీ తెలుగులో వ్రాసిన కరపత్రం ఒకటి పురుషోత్తంకు చేతికి అందింది. అది చదివిన పురుషోత్తంకు క్రీస్తు గురించి మరి యెక్కువగా తెలుసు కోవాలని పించింది. దైవ సంకల్పం ప్రకారం మిషనరీ హెలెన్ నాట్, విలియమ్ డాసన్ మొదలైన క్రైస్తవ ప్రముఖులతో పరిచయం కలిగటం, అప్పటికే రెవ. ప్రిచెట్ (1818) తెలుగులో అనువదించిన నూతన నిబంధన తన చేతికందటంతో ఆయన ఆశ నెరవేరింది. పురుషోత్తం చౌదరి దాన్ని బాగా చదివారు. 1829 లో విశాఖపట్నంలో క్రైస్తవ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. 1833 అక్టోబరు 6 వ తేదీన క్రీస్తుని అనుసరించాలని నిర్ణయించు కొన్నారు. 1833లో 'కులాచార పరీక్ష' అనే పత్రికను రాసి, కులవ్యవస్థను ఖండించారు. 1833 అక్టోబరులో కటక్‌లో 'బాప్తిస్మం' తీసుకొని, క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించారు. 18 రోజులు కాలినడకన పాటలు పాడుకుంటూ ప్రచారం చేస్తూ మద్రాసు వెళ్లారు. 1833 అక్టోబరు 6 వ తేదీన అదే రోజు తన తోటి క్రైస్తవులతో కలిసి ఆరాధిస్తూ..."మా యేసుక్రీస్తుని – మరుగు గల్గెనురా, నా యాత్మ ఘన రక్ష – నగము నెక్కెనురా"...అనే కీర్తనను పాడారు. అది తెలుగులో వెలువడిన మొట్టమొదటి క్రైస్తవ గీతం. పురుషోత్తం క్రైస్తవుడవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల నుండి ఎంతో వ్యతిరేకతను, మరెన్నో అవరోధాలను ఎదుర్కోవలసి వచ్చింది. కాని ఈ శోధనలన్నీ తనలో నిరాశను కలిగించడానికి బదులుగా తాను పొందిన రక్షణానుభవాన్ని ఇతరులకు ప్రకటించాలనే తృష్ణను పెంచాయి. 1836 ఏప్రిల్ 3 వ తేదీన ఆయన భార్య రాధామణి దేవి కూడా క్రైస్తవ్యాన్ని స్వీకరించారు. ఆ సంవత్సరమే చౌదరిని మిషనరీగా అభిషేకించారు. అనేక శ్రమలకు, తిరస్కారాలకు గురైనప్పటికీ, విశ్వాసంలో వెనుకడుగు వేయక, వేలకొలది మైళ్ళు కాలినడకను ప్రయాణించి, ఆంధ్ర దేశంలో అధికభాగం పర్యటిస్తూ విస్తృత సేవ చేసి, తెలుగు క్రైస్తవ సంఘ పితామహుడయ్యారు. చౌదరి విరచిత ఆణిముత్యాల లాంటి పాటలన్నీ కేవలం భక్తిపూరిత మైనవే కాకుండా, సాహితీ సంపదతో తుల తూగు తుంటాయి. కేవలం కీర్తనల్ని మాత్రమే గాక " క్రైస్తవ నీతి ప్రకాశం, సత్య వేద సార సంగ్రహం, "కులాచార పరీక్ష" ఇత్యాది ఎన్నో గ్రంథాల్ని కూడా రచించారు. ఆయన రచనల్లో ఎక్కువగా విగ్రహారాధనని ఖండించారు. ఆయన వ్రాసిన ప్రతి పాట స్వీయ జీవితానుభవ లోతుల్లో నుండి పెల్లుబికినదే. అందుకే అవి ఈ నాటికీ తెలుగు క్రైస్తవ సాహిత్యంలో సజీవ సంకీర్తనలుగా నిలిచి పోయాయి. 1882 లో కనుచూపు పూర్తిగా మందగించిన సమయంలో తన కుమార్తెను పిలిపించుకొని, "సకలేంద్రియములారా – చాలు మీ పనిదీరె" అనే పాటను పాడి, ఆమెచే వ్రాయించారు. చివరకు 1890, ఆగస్టు 26 న తన 87 వ యేట ప్రభువుని చేరుకొన్నారు. చౌదరి కవి ఎన్నో కీర్తనలు రచించారు. పద్య కావ్యాల రచనలలో పద్య కృతులు ఐదు లభిస్తున్నాయి. వాటిలో రెండు శతకాలు – ఒకటి 'యేసు నాయక శతకము'; రెండవది 'యేసు క్రీస్తు ప్రభు శతకము'. ఇక, 'పంచ చామర పన్నములు' పంచ చామర ఛందస్సులో మకుట సహితంగా యెహటరీవాను దలతున్" అన్న కీర్తనను పొందు పరిచాడు కవి. సాగిన అర్థశతి. 'పంచ రత్నములు' ఐదు సీస పద్యాల సంకలనం. క్రైస్తవ నీతి ప్రకాశము, 'సత్యవేద సార సంగ్రహము' అనేవి పద్య కావ్యాలు, వీటిలో క్రీ.శ. 1845లో వెలువడిన 'యేసు నాయక శతకము' తెలుగు శతక వాఙ్మయంలో మొట్టమొదటి క్రైస్తవ శతకం. ప్రస్తుతం చౌదరి రాసిన కీర్తన వినిపించని చర్చి, క్రైస్తవుల ఇళ్లు లేవు. . 1933లో చౌదరి శతజయంతి ఉత్సవాలు ఆంధ్రా – ఒరిస్సాలో ఘనంగా నిర్వహించారు. పురుషోత్తమ చౌదరి స్వహస్తాలతో శ్రీకాకుళం చిన్న బజారులోని తెలుగు బాప్టిస్టు చర్చిని దాదాపు 150 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆయన భార్య శ్రీకాకుళంలోనే మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# 'పితాజీ'గా శిష్య హృదయాల్లో నిలిచిన విద్యా తాపసి



### ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముద్దు రామకృష్ణయ్య స్మరణ
### కటిక పేదరికం నుంచి బీబీసీ వరకు అసాధారణ ప్రస్థానం
### ప్రపంచ దేశాలు తిరిగి విద్యా విధానాలపై అధ్యయనం
### జగిత్యాల విద్యారంగంలో వినూత్న ప్రయోగాలకు శ్రీకారం
### వేలాది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన మహోపాధ్యాయుడు

ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యావేత్త.. సమున్నత ఆశయాలు కలిగిన వ్యక్తి.. విద్యార్థికి పాఠం చెప్పడమే కాదు.. పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే విద్యకు అసలైన అర్థమని ఆచరణలో చూపిన మహోపాధ్యాయుడు ముద్దు రామకృష్ణయ్య. విద్యారంగ అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేసి, వినూత్న ప్రయోగాలతో వేలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఆయనను శిష్యలోకం ప్రేమగా 'పితాజీ' అని పిలుచుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆ విద్యా తాపసి జీవిత ప్రస్థానాన్ని స్మరించుకోవడం భావితరాలకు స్ఫూర్తిదాయకం. 1907 అక్టోబర్ 18న అవిభక్త కరీంనగర్ జిల్లాలోని చారిత్రక మంథనిలో సంప్రదాయ పేద కుటుంబంలో ముద్దు రామకృష్ణయ్య జన్మించారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా చదువుపై ఆయనకున్న తపన మాత్రం తగ్గలేదు. ఉన్నత విద్య కోసం దేశ సరిహద్దులను దాటాలనే సంకల్పంతో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ఆ కాలంలో విదేశాలకు వెళ్లి చదువుకోవడమే గొప్ప సాహసం. అలాంటి పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం కోసం హోటల్‌లో పనిచేయడంతో పాటు చౌకీదారుగా కూడా విధులు నిర్వర్తిస్తూ తన చదువును కొనసాగించినట్లు ఆయన జీవిత విశేషాలు చెబుతున్నాయి. కష్టాలను అవకాశాలుగా మలుచుకుంటూ ఆంగ్ల భాషపై పట్టు సాధించారు.

### బీబీసీలో న్యూస్ రీడర్‌గా..


తన ప్రతిభతో ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌లో న్యూస్ రీడర్‌గా పనిచేసే స్థాయికి ఎదిగారు. సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి విద్యా విధానాలు, సంస్కృతి, సంప్రదాయాలను అధ్యయనం చేశారు. విదేశాల్లో సంపాదించిన అనుభవాన్ని స్వదేశంలోని విద్యారంగానికి ఉపయోగించాలన్న సంకల్పంతో భారత్‌కు తిరిగివచ్చారు. విజయవాడ ఆకాశవాణిలో సహాయ సంచాలకుడిగా పనిచేసినా.. తన అసలు గమ్యం విద్యారంగమేనని భావించారు. విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ విద్యాశాఖలోకి అడుగుపెట్టారు.

### జగిత్యాలలో మొదలైన విద్యా విప్లవం

నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, అనంతరం వరంగల్ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. రాష్ట్రంలో బహుళార్థ సాధక పాఠశాలల ఏర్పాటు జరుగుతున్న సమయంలో స్వయంగా కోరుకుని 1958–59 విద్యా సంవత్సరంలో జగిత్యాల బహుళార్థ సాధక ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదే పాఠశాల నేడు 'ఓల్డ్ హైస్కూల్'గా చిరపరిచితం. అప్పట్లో సుమారు వంద మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందానికి మార్గనిర్దేశం చేస్తూ, దాదాపు రెండు వేల మంది విద్యార్థుల విద్యాబోధనకు నాయకత్వం వహించారు. సమయపాలన, క్రమశిక్షణ, బాధ్యత, నైతిక విలువలతో కూడిన విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. పాఠ్యపుస్తకంలోని పాఠంతోనే విద్య పూర్తికాదని.. విద్యార్థిలో వ్యక్తిత్వ వికాసం, బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందాలని విశ్వసించారు.

### ఆ రోజుల్లోనే సాంకేతిక విద్యాబోధన

కాలానికి ఎంతో ముందుండే ఆలోచనలు రామకృష్ణయ్య సొంతం. పాఠశాలలో ఈతకొలను నిర్మించడంతో పాటు అప్పట్లోనే తరగతి గదుల్లో స్పీకర్లు ఏర్పాటు చేయించారు. తన చాంబర్‌లో ప్రత్యేక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే తరగతి గదుల్లోని విద్యార్థులతో నేరుగా మాట్లాడే విధానాన్ని ప్రవేశపెట్టారు. నేటి ఆధునిక సమాచార వ్యవస్థలను గుర్తుచేసే ఇటువంటి సాంకేతిక ప్రయోగాలను దశాబ్దాల క్రితమే విద్యాబోధనలో ఉపయోగించడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. 1965 జూన్ 26న పదవీ విరమణ చేసే వరకు అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన క్రమశిక్షణ ఎంత కఠినంగా ఉండేదో.. విద్యార్థుల పట్ల ప్రేమ కూడా అంతే ఆత్మీయంగా ఉండేది. అందుకే శిష్యులు ఆయనను ఉపాధ్యాయుడిగా మాత్రమే కాకుండా తండ్రి స్థానంలో నిలిపి 'పితాజీ' అని ప్రేమగా పిలుచుకున్నారు.




### గురువు జ్ఞాపకంగా నిలిచిన విగ్రహం

రామకృష్ణయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన శతజయంతి వేడుకలను శిష్యులు ఘనంగా నిర్వహించారు. ఆయన శిష్యుడు, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం విగ్రహ దాతగా ముందుకొచ్చారు. 2010 సెప్టెంబర్ 7న జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో 'పితాజీ' విగ్రహాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణయ్య ప్రియశిష్యుడు సూరజ్ శివశంకర్ నిర్వహణలో, గిరి నాగభూషణం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉన్నత విద్యాశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎలగందుల రమణ, తాడిపర్తి జీవన్‌రెడ్డి, అప్పటి జగిత్యాల ఆర్డీవో అమయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్వర్‌రాజు తదితరులు పాల్గొని రామకృష్ణయ్యకు నివాళులర్పించారు.

### గురువు అంటే పాఠం కాదు.. జీవన మార్గం

నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవ, హాస్యభరిత ప్రసంగం, మానవత్వం, క్రమశిక్షణ.. ఇవన్నీ ముద్దు రామకృష్ణయ్య వ్యక్తిత్వంలో అంతర్భాగాలు. ప్రపంచాన్ని చూసిన అనుభవాన్ని తనకోసం దాచుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడిగా మార్చారు. ఆధునిక సాంకేతికతను విద్యాబోధనకు జోడించాలన్న ఆయన ఆలోచనలు కాలానికంటే ఎంతో ముందున్నాయి. 1985 అక్టోబర్ 21న ఆయన జీవిత ప్రస్థానం ముగిసినా.. తీర్చిదిద్దిన శిష్యుల్లో, జగిత్యాల ఓల్డ్ హైస్కూల్ చరిత్రలో, విద్యారంగానికి అందించిన వినూత్న ఆలోచనల్లో 'పితాజీ' ముద్దు రామకృష్ణయ్య ఇప్పటికీ సజీవమే. ఉపాధ్యాయుడు ఒక తరగతిని మాత్రమే కాదు.. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దగలడని నిరూపించిన ఆయన జీవితం ఉపాధ్యాయ లోకానికి ఓ పాఠం.. భావితరాలకు ఓ స్ఫూర్తి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయిత రెంటాల

### నేడు రెంటాల గోపాలకృష్ణ జయంతి



రెంటాల గోపాలకృష్ణ, (5 సెప్టెంబర్ 1920–18 జూలై 1995) తెలుగు సాహిత్య భూమికపై తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రచయిత, పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, అనువాదకుడు, నాటకకర్తగా ఆయన సాహిత్య సేవ విస్తృత పరిధిని కలిగి ఉంది. భావ ప్రకటనను సామా జిక బాధ్యతగా స్వీకరించి, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా మలచిన రచయితగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. గుంటూరు జిల్లా రెంటాల గ్రామంలో 1920లో జన్మించిన గోపాలకృష్ణ, బాల్యంలోనే పఠనంపై ఆసక్తి కలిగి చరిత్ర, ఆర్థికశాస్త్రాలలో విద్యాభ్యాసం చేశారు. విద్యాభ్యాసం తరువాత పాత్రికేయ వృత్తిలోకి అడుగుపెట్టి, 'ఆంధ్రప్రభ' పత్రికలో ఉపసంపాదకుడిగా తన జర్నలిజం జీవితాన్ని ప్రారంభించారు. ఆపై 'ఈనాడు' పత్రికలో కీలక పదవులు నిర్వహించారు. వార్తలను సామాజిక రాజకీయ విశ్లేషణతో సమన్వయం చేస్తూ, నూతన దృక్పథాన్ని పాఠకుల ముందు ఉంచారు. ఆయన రాసిన సంపాదకీయాలు పాఠకుల ఆలోచనా సరళిని ప్రభావితం చేశాయి. పత్రికా రచనను ప్రాణంలా భావించిన గోపాలకృష్ణ, మాతృభూమి, అభ్యుదయ, విజయప్రభ, ఆనందవాణి, ఆంధ్రజ్యోతి వారపత్రిక, స్వాతి మాసపత్రిక, బాలజ్యోతి పిల్లల పత్రిక వంటి అనేక ప్రముఖ ముద్రిత మాధ్యమాల్లో రచనలు కొనసాగించారు. వార్తల వెనుకనున్న సంక్లిష్టతను విశ్లేషించి ప్రజలకు చేరువ చేసే శైలితో ఆయన పాత్రికేయత విలక్షణంగా నిలిచింది. ఆయన కలం మానవీయ విలువలకు ప్రతిబింబంగా మారింది. సాహిత్య రంగంలో కూడా గోపాలకృష్ణ అభినవ దిశల్లో ప్రయాణించారు. ఇది నా కథ కాదు, కాలం కాకిలా ఎగిరింది, మనిషి స్వప్నం వంటి నవలల్లో వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నిరంకుశత, కుల వ్యవస్థలపై పోరాటం వంటి అంశాలను శక్తివంతంగా చిత్రించారు. ఆయన కథలు చిన్నవైనా భావ వ్యాప్తి లోతుగా, మానవ స్వభావం లోని అంతర్లీన సంఘర్షణలను ప్రతిఫలించే విధంగా ఉండేవి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ స్పష్టంగా ప్రతిఫలించేది. అనువాద రంగంలో గోపాలకృష్ణ చేసిన కృషి విశేషంగా నిలిచింది. ముఖ్యంగా మార్క్సిస్ట్ సిద్ధాంతాలకు సంబంధించిన పలు ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించి, అభ్యుదయ భావజాలాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. అనువాదాన్ని ఆయన భాషాంతరం కాదని భావాంతరంగా చూసారు. భావ గంభీరతను, భాషా సామర్థ్యాన్ని సమన్వయించుతూ చేసిన ఆయన అనువాదాలు తెలుగులో విశిష్టమైన స్థానం సంపాదించాయి. విమర్శా రచనలలో గోపాలకృష్ణ నిర్మాణాత్మక దృష్టితో, నిశితంగా, వాస్తవతను విశ్లేషించగల శైలితో నిలిచారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా సామాజిక అవసరాలను ప్రతిబింబించగల రచనలవైపు దృష్టిపెట్టి, సమకాలీన సాహిత్యంపై గంభీరంగా స్పందించారు. ఆయన విమర్శలు సాహిత్యాన్ని తన సామాజిక బాధ్యత గుర్తు చేసుకునేలా చేసేవి. సంపాదకునిగా గోపాలకృష్ణ పాత్ర అసాధారణంగా నిలిచింది. అభ్యుదయ రచయితలకు ప్రోత్సాహం ఇచ్చి, వారి రచనలకు పత్రికల్లో చోటు కల్పించారు. నూతన రచయితలను తీర్చిదిద్దడంలో ఆయన నైపుణ్యం ప్రత్యేకమైనది. సంపాదకత్వాన్ని కేవలం పేజీల ఆవరణగా కాక, ప్రజా చైతన్య వేదికగా మలచిన వ్యక్తిగా ఆయన సాహిత్య చరిత్రలో గుర్తింపు పొందారు. సమకాలీన సమస్యలపై మౌలిక విమర్శను మేల్కొల్పే వ్యాసాల ద్వారా పాఠకులలో కొత్త దృక్పథాన్ని పెంపొందించారు. రచయితగా గోపాలకృష్ణను ప్రత్యేకంగా నిలిపే అంశాల్లో ముఖ్యమైనవి – పదజాలంలో స్పష్టత, భావ ప్రకటనలో లోతు, విమర్శలో నిజాయితీ, సంపాదకత్వంలో తాత్త్విక నిబద్ధత. రచనను వృత్తిగా కాక, బాధ్యతగా పరిగణించి, జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేసిన అరుదైన ఉదాహరణగా ఆయన నిలిచారు. రెంటాల గోపాలకృష్ణ రచనలు నేటికీ సమకాలీనతను కలిగి ఉన్నాయి. సామాజిక సమస్యలను కేంద్రంగా ఉంచుకుని, మార్పుకు మార్గనిర్దేశం చేసే శక్తిని వాటిలో నిక్షిప్తం చేశారు.

ఆయన జీవితమే ఒక ఉద్యమం, రచనలే ఒక సందేశం. భావసాంద్రతతో కూడిన ఆయన రచనలు పాఠకులను కలచి వేస్తాయేమో కానీ, తేలికగా వదిలిపెట్టవు. ఆయన కలం ప్రశ్నించేది – సమాజాన్ని, చట్టాలను, మనవాణ్ని. ఆయన రచనలను చదవడం ద్వారా మనం మనల్ని మళ్ళీ ఆలోచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. రెంటాల గోపాలకృష్ణ ఒక రచయిత మాత్రమే కాదు – ఒక అభ్యుదయ దృక్కోణం. సాహిత్యాన్ని మార్పు కోసం, మానవీయత కోసం, సమాజపు అణగారిన గొంతుకలకు మద్దతుగా వినిపించిన ఆత్మగాథగా ఆయన రచనలు నిలిచి పోయాయి. తెలుగు సాహిత్యంలో ఆయన ఒక శాశ్వత శిఖరం. ఆయన రచనలను మనం గౌరవించాలి కాదు – అనుసరించాలి. ఎందుకంటే ఆయన కలం భావాలకు మార్గాన్ని చూపినది, సమాజానికి దిక్సూచి అయినది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# ముగ్గురు పిల్లలతో కలిసి రెజ్లర్ ఆత్మహత్య

రెజ్లర్ అశ్విని సహా ముగ్గురి మృతి.. మరో చిన్నారి పరిస్థితి విషమం

కుటుంబ వేధింపులే కారణమంటూ తండ్రి ఫిర్యాదు

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. నల్‌దుర్గ్ కోట వద్ద తీవ్ర విషాదం

**ధారాశివ్, సెప్టెంబర్ 4 (తెలంగాణ జాగృతి):** మహారాష్ట్రలోని ధారాశివ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 'మహారాష్ట్ర టైగ్రెస్'గా పేరొందిన జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ అశ్విని మనోహర్ పాల్ తన ముగ్గురు పిల్లలతో కలిసి నల్‌దుర్గ్ కోట వద్ద లోయలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో అశ్విని, ఆమె ఐదేళ్ల కుమారుడు అజింక్యా మృతి చెందగా.. కవల కుమార్తెలలో క్రాంతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసింది. మరో చిన్నారి వీరా తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. జాతీయ స్థాయి రెజ్లింగ్‌లో అశ్విని ఐదు స్వర్ణాలు, ఆరు రజత పతకాలు సాధించినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. క్రీడా రంగంలో గుర్తింపు పొందిన ఆమె మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. అశ్విని మృతికి కుటుంబ సమస్యలే కారణమని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తమామల నుంచి తన కుమార్తె శారీరక, మానసిక వేధింపులు ఎదుర్కొందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా నల్‌దుర్గ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆరోపణలపై విచారణ అనంతరమే పూర్తి వివరాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.


# పవర్ లిఫ్టర్ కేయాకు ఆన్‌లైన్ వేధింపులు

తన చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని ఆవేదన

నకిలీ ఖాతాలు.. ఏఐ చిత్రాలతో వేధింపులంటూ వెల్లడి

'నా విజయాల గురించే మాట్లాడాలనుకున్నా' అంటూ భావోద్వేగ పోస్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 :** పవర్‌లిఫ్టింగ్‌లో 140 కిలోల బరువెత్తి సంచలనంగా మారిన భారత యువ అథ్లెట్ కేయా బెనర్జీ.. ఇప్పుడు తాను ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ వేధింపులపై ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించడంతో పాటు తన ముఖం, శరీరాన్ని ఉపయోగించి కృత్రిమ మేధతో అసభ్యకర చిత్రాలను తయారు చేసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఐపీఎఫ్ ప్రపంచ సబ్ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కేయా రజత పతకం సాధించారు. 21 ఏళ్ల వయసులోనే 140 కిలోల బరువును ఎత్తిన ఆమె ప్రదర్శన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తన బరువుతో పోలిస్తే మూడున్నర రెట్లకు పైగా బరువును ఎత్తడంతో భారత క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించారు. అయితే తన క్రీడా విజయం తర్వాత ఆన్‌లైన్‌లో ఎదురైన అనుభవాలు తీవ్రంగా కలచివేశాయని కేయా తన కొత్త సామాజిక మాధ్యమ ఖాతాలో వెల్లడించారు. భారత మహిళా అథ్లెట్‌గా తాను లైంగిక వేధింపులతో పాటు జాతి, వంశం, కులాన్ని లక్ష్యంగా చేసుకున్న అభ్యంతరకర వ్యాఖ్యలను ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. తన ముఖం, శరీరాన్ని అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి కృత్రిమ మేధతో రూపొందించిన అనేక నకిలీ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో కనిపించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేయా ఆవేదన వ్యక్తం చేశారు. తన పేరుతో నకిలీ ఖాతాలు కూడా సృష్టిస్తున్నారని తెలిపారు. తాను వ్యక్తిగత జీవితాన్ని గోప్యంగా ఉంచుకోవడానికే ఇష్టపడతానని, వ్యక్తిగత ఖాతాల్లో ఫొటోలను పెద్దగా పంచుకోనని పేర్కొన్నారు. కానీ ప్రతిరోజూ సామాజిక మాధ్యమాల్లో తనకు సంబంధించిన నకిలీ చిత్రాలు కనిపిస్తుండటం తీవ్ర అసహనానికి గురిచేస్తోందన్నారు. తన పాత ఖాతాను ఇన్‌స్టాగ్రామ్ ఇప్పటికే నిలిపివేసిందని, అందులో కేవలం 300 మంది అనుచరులు మాత్రమే ఉన్నారని కేయా తెలిపారు. కొత్త ఖాతా ద్వారా ఈ విషయాలను వెల్లడించాల్సి వచ్చిందన్నారు. 'నా గురించి మాట్లాడేటప్పుడు క్రీడల్లో సాధించిన విజయాలే ప్రస్తావనకు రావాలని కోరుకున్నా. ఈ విషయాలను బహిర్గతం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ నా పక్షాన నేను నిలబడేందుకు మరో మార్గం కనిపించలేదు' అని కేయా పేర్కొన్నారు. క్రీడా రంగంలో సత్తా చాటి దేశానికి పతకం అందించిన యువ అథ్లెట్.. తన విజయాన్ని ఆస్వాదించాల్సిన సమయంలో ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం మహిళా క్రీడాకారుల డిజిటల్ భద్రతపై మరోసారి చర్చకు దారితీసింది.



# మంధాన మరో అరుదైన మైలురాయి

- మూడో భారత క్రికెటర్‌గా రికార్డు!
- మూడు ఫార్మాట్లలోనూ ఒకటికి మించి సెంచరీలు
- రోహిత్, రాహుల్ సరసన స్మృతి మంధాన
- ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్
- హాంకాంగ్‌పై 124 పరుగులతో విధ్వంసం
- సెమీస్‌లోకి దూసుకెళ్లిన భారత్



**కొలంబో, సెప్టెంబర్ 4 (తెలంగాణ జాగృతి):** భారత మహిళా క్రికెట్ స్టార్ స్మృతి మంధాన అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో టెస్టులు, వన్డేలు, టీ20లు.. మూడు ఫార్మాట్లలోనూ ఒకటి కంటే ఎక్కువ సెంచరీలు సాధించిన మూడో భారత క్రికెటర్‌గా నిలిచారు. మహిళల ఆసియా కప్‌లో హాంకాంగ్‌పై సెంచరీతో ఈ ప్రత్యేక క్లబ్‌లో రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్ సరసన చేరారు. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్ కూడా మంధానే కావడం విశేషం. అంతర్జాతీయ క్రికెట్‌లో రోహిత్ శర్మ టెస్టుల్లో 12, వన్డేల్లో 34, టీ20ల్లో 5 సెంచరీలు సాధించగా.. కేఎల్ రాహుల్ టెస్టుల్లో 12, వన్డేల్లో 8, టీ20ల్లో 2 శతకాలు నమోదు చేశారు. ఇప్పుడు స్మృతి మంధాన టెస్టుల్లో 2, వన్డేల్లో 14, టీ20ల్లో 2 సెంచరీలతో వారి సరసన నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో సెంచరీల రారాజులుగా పేరొందిన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీ ఈ ప్రత్యేక జాబితాలో లేకపోవడం ఆసక్తికరం. కోహ్లీ టెస్టులు, వన్డేల్లో భారీ సంఖ్యలో సెంచరీలు సాధించినప్పటికీ అంతర్జాతీయ టీ20ల్లో ఒకే శతకం చేశారు. సచిన్ తన కెరీర్‌లో ఒకే ఒక్క అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడారు. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగారు. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 124 పరుగులు చేసి భారత భారీ స్కోరుకు బాటలు వేశారు. ఆమె మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ 193 పరుగులు చేసింది. అనంతరం హాంకాంగ్‌ను 56 పరుగులకే ఆలౌట్ చేసి 137 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మహిళల ఆసియా కప్‌లో భారత్ సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మంధాన మాత్రం అరుదైన సెంచరీ రికార్డుతో మరోసారి భారత మహిళా క్రికెట్‌లో తన ప్రత్యేకతను చాటుకున్నారు.

# 2027 ప్రపంచకప్‌పై గురి

## బుమ్రా కోసం 'ప్లాన్ బీ'!

స్టార్ పేసర్ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ప్రత్యేక దృష్టి

బెంగళూరులో మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు

ఆఫ్ఘన్ సిరీస్‌కు ముందు తుది అంచనా

బుమ్రాకు విశ్రాంతిస్తే ప్రిన్స్ యాదవ్‌కు ఛాన్స్

దీర్ఘకాలిక పనిభారం నిర్వహణకే ప్రాధాన్యం



**బెంగళూరు, సెప్టెంబర్ 4:** 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా విషయంలో బీసీసీఐ ఆచితూచి అడుగులు వేస్తోంది. ప్రతి సిరీస్‌లోనూ అతడిని బరిలోకి దింపడం కంటే కీలక సమయాల్లో పూర్తి ఫిట్‌నెస్‌తో అం దుబాటులో ఉండేలా పనిభారాన్ని నిర్వహించడానికే ప్రాధాన్యం ఇస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు బుమ్రా ఫిట్‌నెస్‌ను మరోసారి పూర్తిస్థాయిలో పరీక్షిస్తోంది. ఒకవేళ అతడికి విశ్రాంతి ఇవ్వాల్సి వస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచుతున్నట్లు సమాచారం. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు మ్యాచ్ సిమ్యులేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా కూడా వీటిలో పాల్గొంటున్నారు. వైద్య బృందం వీరిని క్లినికల్‌గా ఫిట్‌గా ప్రకటించినప్పటికీ.. మ్యాచ్ పరిస్థితుల్లో శారీరక సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేసే శక్తి, పనిభారాన్ని తట్టుకునే సామర్థ్యాన్ని అంచనా వేసేందుకే ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు టీ20ల సిరీస్ కోసం భారత జట్టు సెప్టెంబర్ 10న ఢిల్లీలో సమావేశం కానుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో అంతకంటే ముందే బుమ్రా ఫిట్‌నెస్‌పై స్పష్టత రావాల్సి ఉంది. బుమ్రా విషయంలో కేవలం గాయం నుంచి కోలుకున్నారా లేదా అన్నదే కాకుండా.. మ్యాచ్ ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, వరుసగా బౌలింగ్ చేయగల శక్తి, దీర్ఘకాలిక పనిభారాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

### 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్?

ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయిస్తే యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం దక్కవచ్చని సమాచారం. జూన్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన ప్రిన్స్.. ఆ తర్వాత జింబాబ్వే పర్యటనలో గాయంతో ఇబ్బంది పడ్డాడు. ప్రస్తుతం కోలుకుని ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. 2026 ఐపీఎల్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనతో ప్రిన్స్ యాదవ్‌ను పరిమిత ఓవర్ల క్రికెట్‌లో భవిష్యత్ పేసర్‌గా సెలెక్టర్లు పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బుమ్రా అందుబాటులో లేకుంటే ఆఫ్ఘన్ సిరీస్‌లో అతడికి మరో అవకాశం దక్కవచ్చు. 2026లో గాయం తర్వాత బుమ్రా పనిభారాన్ని భారత జట్టు మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా పర్యవేక్షిస్తోంది. ఒక్క ఆఫ్ఘనిస్తాన్ సిరీస్‌ను కాకుండా రాబోయే కీలక సిరీస్‌లు, 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని అతడిని వినియోగించాలన్నది బీసీసీఐ వ్యూహంగా కనిపిస్తోంది. ఫిట్‌నెస్ పరీక్షల్లో బుమ్రా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నట్లు తేలితే ఆఫ్ఘనిస్తాన్‌తో సిరీస్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంటుంది. లేదంటే అతడిపై తొందరపడకుండా విశ్రాంతి ఇచ్చి.. 'ప్లాన్ బీ'గా ప్రిన్స్ యాదవ్‌ను రంగంలోకి దింపే అవకాశమున్నట్లు తాజా నివేదికలు సూచిస్తున్నాయి.

# క్రికెటర్ రోహిత్‌పై రెండేళ్ల నిషేధం!

ధ్రువీకరణ పత్రాల్లో మూడు పుట్టిన తేదీలు

వయసులో 27 నెలల వ్యత్యాసం గుర్తింపు

ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగింపు

మరో 64 మంది యువ క్రికెటర్లపైనా చర్యలు



**కోల్‌కతా, సెప్టెంబర్ 4:** బిగ్ షాక్: క్రికెటర్ రోహిత్ యాదవ్‌పై రెండేళ్ల కఠిన నిషేధం విధించిన బీసీసీఐ రోహిత్ యాదవ్‌పై నిషేధం (19) 64 మందిపై బెంగాల్ వేటు (18) వయసు మోసాలపై ఉక్కుపాదం (19) కోల్‌కతా, సెప్టెంబర్ 4 (స్పందన న్యూస్): వయసు ధృవీకరణ పత్రాల్లో తీవ్ర అవకతవకలకు పాల్పడిన భారత అండర్-19 జట్టు ఆటగాడు, బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మౌలిక మండలి (దీజజ×) రెండేళ్ల పాటు కఠిన నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. నూతన క్రికెట్ సీజన్ ముందస్తుగా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (జూాదీ) చేపట్టిన పత్రాల పరిశీలనలో ఈ జాలీ మోసం వెలుగుచూసింది. ఇటీవల శ్రీలంక పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసి, త్వరలో ఆస్ట్రేలియాతో జరగబోయే ద్వైపాక్షిక సిరీస్‌కు ఎంపికైన రోహిత్ వద్ద వేర్వేరు పుట్టిన తేదీలతో ధృవీకరణ పత్రాలు ఉండటమే కాకుండా, వయసులో ఏకంగా 27 నెలల వ్యత్యాసం ఉన్నట్లు నిరూపితమైంది. దీంతో అతడిని ఆస్ట్రేలియా సిరీస్ నుంచి తక్షణమే తొలగించి, దేశంలోని అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు హెచ్చరిక సమాచారం పంపారు. రోహిత్ యాదవ్‌తో పాటు ఇలాంటి వయసు వ్యత్యాసాలకు పాల్పడిన మరో 64 మంది క్రికెటర్లపై బెంగాల్ క్రికెట్ సంఘం వేటు వేసింది. ఈ నిషేధిత జాబితాలో 2022 అండర్-19 ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో కీలక పాత్ర పోషించిన ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ రవికుమార్ కూడా ఉండటం క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపింది. రవికుమార్ వయసులో 40 నెలలకు పైగా భారీ వ్యత్యాసం ఉన్నట్లు నిర్ధారించడంతో అతడి పాత జూనియర్ రికార్డులన్నింటినీ రద్దు చేశారు. భారత జూనియర్ క్రికెట్‌లో సుదీర్ఘకాలంగా ప్రధాన సమస్యగా మారిన వయసు మోసాలను తీవ్రంగా పరిగణిస్తున్న బీసీసీఐ, 2020లో స్వచ్ఛందంగా నిజమైన వివరాలు వెల్లడించేందుకు ఇచ్చిన సడలింపులను ఉల్లంఘించిన ప్రతీ ఒక్కరిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది.



# సంక్రాంతి బరిలో 'కాకా'.. షూటింగ్‌పై కీలక అప్‌డేట్

సినిమా డెస్క్:

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' చిత్రంపై వస్తున్న వాయిదా ప్రచారాలకు చిత్రబృందం తెరదించింది. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 7 నుంచి తదుపరి చిత్రీకరణ షెడ్యూల్ ప్రారంభం కానుందని వెల్లడించింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి పాల్గొననున్నారు. గతంలో ఈ ఇద్దరి కలయికలో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఘన విజయం సాధించడంతో 'కాకా'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కెవిఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని జనవరి 13న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. తాజా షెడ్యూల్‌లో సినిమాకు కీలకమైన కథా ఘట్టాలతో పాటు భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు సమాచారం. షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో సినిమా వాయిదా పడుతుందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని చిత్రబృందం స్పష్టం చేసినట్లయింది. దీంతో 'కాకా' సంక్రాంతి బరిలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని మెగా అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# ప్రేమ హద్దులు చెరిపేసే 'ఎపిక్' స్టోరీ

బీ బ్లాక్ బస్టర్ జంట ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్ వచ్చే వారం సెప్టెంబర్ 11 విడుదలకు రెడీ అయిపోయింది. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ నిర్మించిన ఈ రామ్ కామ్ కు హేశం అబ్దుల్ వహాబ్ సంగీతం సమకూర్చారు. ఇప్పటికే పలు వాయిదాల వల్ల లేట్ అయిన ఎపిక్ ద్వారా ఆదిత్య హాసన్ బిగ్ స్క్రీన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 90స్ మిడిల్ క్లాస్ వెబ్ సిరీస్ రూపంలో తొలి అడుగుతోనే హిట్టు కొట్టిన సంగతి తెలిసిందే. ఇవాళ ట్రైలర్ లాంచ్ జరిగింది. కథేంటో దాచకుండా ఓపెన్ చేశారు. మధ్యతరగతికి చెందిన ఆనంద్(ఆనంద్ దేవరకొండ)కు జీవితంలో దర్శకుడు కావాలనే లక్ష్యం ఉంటుంది. అయితే ఇంట్లో పరిస్థితులు సహకరించవు. దీంతో ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్తాడు. అక్కడ పరిచయమైన ఓ అమ్మాయి (వైష్ణవి చైతన్య) తక్కువ సమయంలోనే ప్రేమ నుంచి శారీరకంగా ఒక్కటయ్యేంత దగ్గరవుతుంది. ఆ తర్వాత అనూహ్యమైన పరిస్థితులు తలెత్తుతాయి. అదేంటో తెరమీద చూడాలి. యూత్ ని టార్గెట్ చేసిన ఎపిక్ లో టేకింగ్ ఫ్రెష్ గా అనిపిస్తోంది. ఫిల్టర్స్ లేకుండా ఒక జెన్ జీ అమ్మాయి, అబ్బాయి మధ్య ఎలాంటి సంభాషణలు ఉంటాయో చాలా రియలిస్టిక్ గా రాసుకున్నారు ఆదిత్య హాసన్. పీరియడ్స్ గురించి నేరుగా ఒక డైలాగు పెట్టడం దానికో చిన్న ఉదాహరణ. జంట కూడా కొత్తగా ఉంది. హేశం బ్యాక్ గ్రౌండ్ స్కోర్, లండన్ నిర్మాణ విలువలు మంచి క్వాలిటీ తీసుకొచ్చాయి. టార్గెట్ ఆడియన్స్ కి కనెక్ట్ అయ్యేలా ఉంది. కాకపోతే కుటుంబ ప్రేక్షకులు ఇంత ఓపెన్ లవ్ స్టోరీని ఏ మేరకు రిసీవ్ చేసుకుంటారో చూడాలి. యువత వేగంగా అనుసంధానం అవుతారు. మూడేళ్ళ గ్యాప్ లో ఉన్న ఆనంద్ దేవరకొండతో పాటు రెండు డిజాస్టర్లు చూసిన వైష్ణవి చైతన్యకు ఈ సినిమా సక్సెస్ కావడం చాలా కీలకం. కార్తీ సర్దార్ 2, సుమంత్ మహేంద్రగిరి వారాహి రూపంలో పోటీ ఉన్నప్పటికీ కంటెంట్ పరంగా టీమ్ చాలా కాన్ఫిడెన్స్ గా ఉంది. ఇవాళ జరిగిన వేడుకకు ఆనంద్ వదిన రష్మిక మందన్న గెస్టుగా రావడం విశేషం.



# సినిమాలతో సమాజాన్ని నాశనం చేస్తున్నారు

80, 90 దశకాల్లో తెలుగు సినిమాల్లో వైభవం చూసిన హీరోల్లో సుమన్ ఒకడు. కొన్ని సూపర్ హిట్లతో అప్పటి టాప్ 4 హీరోలకు గట్టి పోటీ ఇచ్చాడాయిన. ఐతే తర్వాత హీరోగా మార్కెట్ కోల్పోయి.. క్యారెక్టర్, విలన్ రోల్స్ వైపు మళ్ళిన ఈ నటుడు ఇప్పుడు అరుదుగా సినిమాల్లో కనిపిస్తున్నారు. తాజాగా ఆయన ఇప్పటి సినిమాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఇప్పటి ఫిలిం మేకర్లకు సామాజిక బాధ్యత ఉండట్లేదని.. కొన్ని సినిమాలు సమాజాన్ని నాశనం చేసేలా ఉంటున్నాయని ఆయన మండిపడ్డారు. సెన్సార్ బోర్డు తీరు మీద కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అసభ్యకర, తీవ్ర హింసాత్మక కంటెంట్ ను సెన్సార్ ఎలా అనుమతిస్తోందో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. ఒకప్పుడు సినిమాలు కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్ళి ఆస్వాదించేలా ఉండేవని.. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు విడివిడిగా థియేటర్లకు వెళ్ళి ఎవరికి నచ్చింది వాళ్ళు చూసుకునే పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. ఇప్పటికే పిల్లలు, యువత.. స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా ప్రభావంతో పెడదోవ పడుతున్నారని. ఇలాంటి సమయంలో సినిమాల ద్వారా వారి మెదళ్లలో వికృత ఆలోచనలను నాటి చెడు వైపు మళ్లించడం ఎంతవరకు సమంజసమని సుమన్ ప్రశ్నించారు.



# పరుగులు పెడుతున్న ప్యారడైజ్ బృందం

ప్యాన్ ఇండియా సినిమాలకు వచ్చే అతి పెద్ద చిక్కు రిలీజ్ డేట్ దగ్గర పడే కొద్దీ ఒత్తిడి ఎక్కువైపోవడం. ఆ మధ్య నాగార్జున అన్నట్టు ఫస్ట్ కాపీని మనం కనీసం రెండు వారాల ముందే సిద్ధం చేసుకోలేని పరిస్థితులు కొని తెచ్చుకుంటున్నాం. దానికి కారణాలు ఏమైనా ముందస్తు ప్లానింగ్ సరిగ్గా ఉండటం లేదన్నది ఆయన వెర్షన్. అందులో నిజం లేకపోలేదు. ఆర్ఆర్ఆర్ లాంటి వందల కోట్ల మూవీ నుంచి లెనిన్ లాంటి మీడియం బడ్జెట్ చిత్రాలకు సైతం ఈ ప్రెజర్లు వస్తూనే ఉన్నాయి.

ఇప్పుడు ప్యారడైజ్ వంతు వచ్చింది. సెప్టెంబర్ 24 ముంచుకు వస్తోంది. ఎక్కువ టైం లేదు. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ తొమ్మిదో తేదీ నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ మొదలుపెడతామని ప్రకటన కూడా ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లో డెడ్ లైన్ మీట్ అయ్యేందుకు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల బృందం కిందా మీద పడుతున్నట్టు ఇన్ సైడ్ టాక్. ఇంకా కొందరు కీలక ఆర్టిస్టుల డబ్బింగు పెండింగ్ ఉందట. వచ్చే వారంలోగా ఆ లాంఛనం అయిపోతే ఒక టెన్షన్ తీరిపోతుంది.

ముందు ట్రైలర్ సిద్ధం చేయాలి. బ్యాలన్స్ ఉన్న లిరికల్ సాంగ్స్ ఎప్పుడు వదలాలనేది నిర్ణయించుకోవాలి. ప్రీ రిలీజ్ ఈవెంట్స్ ఎక్కడెక్కడ చేయాలనే దాని మీద ఇప్పటి నుంచే ప్లానింగ్ ఉండాలి. ముంబై చెన్నై బెంగళూరు లాంటి ప్రధాన నగరాల్లో మీట్ ది ప్రెస్ ని ర్వహించాలి. వీటికి తోడు ఇంటర్వ్యూలు ఉండనే ఉంటాయి. చేతిలో ఉన్నది కేవలం 19 రోజులు. ఫ్లాష్ బ్యాక్ లోకి వెళ్తే హిట్ 3 థర్డ్ కేసుకి నాని నెల రోజులు నాన్ స్టాప్ పబ్లిసిటీ చేయడం గుర్తుండే ఉంటుంది.



# సూపర్ స్టార్ సరసన మమితా బైజు

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారి అన్ని ఇండస్ట్రీల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ తన క్యూట్ లుక్స్, యాక్టింగ్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనిట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించి సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఇలా వరుస విజయాలతో తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న మమిత, తెలుగు సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. అదీ కూడా తన మొదటి తెలుగు సినిమాలోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుందనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు.. తన తదుపరి అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మమితను హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు టాక్. ఒకవేళ ఇదే నిజమైతే మమితా బైజు బిగ్ ఆఫర్ అని చెప్పవచ్చు. టాలీవుడ్‌లో టాప్ ఖాయమని ఫ్యాన్స్ అవుతున్న మహేష్ కెరీర్‌కి తెలుగులో ఇది ఊహించని సూపర్ స్టార్ పక్కన నటిస్తే హీరోయిన్‌గా స్థిరపడటం భావిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ ఈ క్రేజీ కాంబినేషన్ న్యూస్ విన్న ఫ్యాన్స్, మూవీ లవర్స్ మాత్రం ఎగ్జైట్‌మెంట్‌తో ఈ కాంబో ఓకే అయితే బాగుండు అని కోరుకుంటున్నారు.



# మాతో పాటు మీరు ఆస్వాదిస్తారు..

రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు. ఈమేరకు ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో హీరోయిన్ అమృత చౌదరి మాట్లాడుతూ.. 'నీ పరిచయం సాంగ్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. ఈ సాంగ్ షూటింగ్ చేసేప్పుడు మేము చాలా ఎంజాయ్ చేశాం. అలాగే మీరూ ఈ పాటను ఆస్వాదిస్తారని అనుకుంటున్నాను. రావులపాలెంలో ఈ పాట చిత్రీకరణ జరిగింది. అక్కడ షూటింగ్ చేసినన్ని రోజులు స్థానిక ప్రజలు ఎంతో ప్రేమను చూపించారు. బొబ్బట్లు, చేపలు తీసుకొచ్చి ఇచ్చేవారు. వాళ్ల నిస్వార్థ ప్రేమను చూశాం. అనూప్ గారు మాకు బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644